Follow: @ANNTELUGU
17-06-2025
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 195 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఎఎన్ఎన్ - మహా మీడియా కిట్లు ఆవిష్కరణ

మహా: ఎఎన్ఎన్ తెలుగు న్యూస్ ఛానల్, మహాపత్రిక మీడియా కిట్లను అమ్మన్యూస్ నెట్ వర్క్ మీడియాసంస్థల ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ల్యాప్ ట్యాప్ బ్యాగ్ తో సహా మీడియా ప్రతినిధులకు రెగ్యులర్ గా ఉపయోగపడే 16 రకాల వస్తువులతో ఈ కిట్ ను రూపొందించగా, సోమవారం ఆవిష్కరించి పలువురు మీడియా ప్రతినిధులకు అందజేశారు.

**టాప్ న్యూస్**

### రేవంత్ రెడ్డిని కేటీఆర్ రెచ్చగొడుతున్నారు

- ఆయనకు జైలుకు వెళ్ళాలన్న కుతూహలం ఉంది
- మంత్రి సీతక్క



02

### శిక్ష అనుభవించాల్సిందే..

- తప్పుచేసిన వారు ఎవరైనా ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా
- కేసీఆర్, కేటీఆర్, కవితలది పైసల పంచాయితీ
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



03

### మాజీ మంత్రి హరీష్ రావుకు అస్వస్థత

- సికింద్రాబాద్ ఆస్పత్రికి తరలింపు



03



# అందరికీ రైతు భరోసా

## రైతాంగానికి తెలంగాణ సర్కార్ శుభవార్త

## 9 రోజుల్లో.. 9 వేల కోట్లు

70,11,984 మంది రైతులకు పెట్టుబడి సాయం

ఎకరాలతో సంబంధం లేకుండా అందజేస్తామన్న సీఎం రేవంత్

మీటనొక్కి రైతుల ఖాతాల్లోకి భరోసా డబ్బులు జమ

తొలిరోజు రెండెకరాల లోపు రైతులకు టకీటకీ మెసేజ్ లు

**హైదరాబాద్, మహా:**

తొలకరి ప్రారంభమై వ్యవసాయ పనులు ముమ్మరమైన తరుణంలో రాష్ట్ర రైతాంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. లక్షలాది మంది రైతుల సమక్షంలో 'రైతు నేస్తం' వేదికగా ఆన్‌లైన్ ద్వారా మీట నొక్కి రైతులందరికీ 'రైతు భరోసా' నిధులను విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 70,11,984 మంది రైతులకు పెట్టుబడి సాయంగా దాదాపు 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నగదు బదిలీ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు.

మిగతా 2లో



### పదేళ్లు మన ప్రభుత్వమే

- ఫోన్ ట్యాపింగ్ చేసి భార్యభర్తల మాటలిన్నరు
- ధరణి దోపిడీ చేస్తే.. భూ భారతి తెచ్చి రైతులకు చుట్టం చేశాం
- మేము ఎప్పుడూ జనం మధ్యలోనే ఉన్నాం.. ఫామ్ హౌస్ లో కాదు
- రైతు భరోసా నిధులు విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ హాట్ కామెంట్స్

వివరాలు 2లో



### మంత్రి పొంగులేటిపై పీసీసీ చీఫ్ ఆగ్రహం

పార్టీలో చర్చించకుండా ప్రకటనలు వద్దు

వివరాలు 2లో



### జైలుకెళ్తే సీఎం కావు

- కేటీఆర్‌పై ఎంపీ చామల సెటైర్లు
- హీరో మహేశ్ బాబును కాపీ కొడుతుండు
- కుట్రలు, కుతంత్రాలకు కేసీఆర్ కుటుంబం నిలయం

వివరాలు 3లో



### వాట్సప్‌లో త్వరలో యాడ్స్

- అప్‌డేట్స్ ట్యాబ్‌లో ఇకపై ప్రకటనలు
- ఛానెల్స్‌కు సబ్‌స్క్రిప్షన్ ఫీజు

వివరాలు 2లో



### పోలవరం మార్పులను తిరస్కరించండి

కేంద్ర మంత్రి భుపెండర్ యాదవ్ కు మంత్రి ఉత్తమ్ లేఖ

వివరాలు 2లో

# కావాలంటే జైల్లో పెట్టండి

## 8 గంటలు.. 60 ప్రశ్నలు

ఫోన్ ఇవ్వాలన్న అధికారులు.. తీసుకురాలేదన్న కేటీఆర్

మరోసారి పిలుస్తామన్న విచారణ అధికారులు

ప్రశ్నిస్తున్నందుకే.. కేసులు కేటీఆర్



**హైదరాబాద్, మహా:**

ఫార్ములాఈ కార్ రేస్ నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణ సోమవారం ముగిసింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయనను దాదాపు ఎనిమిది గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఉదయం ప్రారంభమైన విచారణలో సుమారు 60 ప్రశ్నలను కేటీఆర్‌పై సంధించినట్లు సమాచారం. ఫార్ములాఈ కేసులో ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించడం ఇది రెండోసారి. ఎఫ్ఈవో (ఫార్ములా ఈ ఆపరేషన్స్) కంపెనీ ప్రతినిధులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ నిధుల దుర్వినియోగం, రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం లేకుండా నిధులను ఎలా మళ్లించారన్న అంశాలపై ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఏసీబీ ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు చెప్పారు. హెచ్ఎండీఏ నిధులను ఎఫ్ఈవో సంస్థకు నిబంధనల ప్రకారమే పంపామని, ఈ వ్యవహారంలో తాను వ్యక్తిగతంగా ఎలాంటి లబ్ధి పొందలేదని ఆయన అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో

## దేశం విడిచి వెళ్లొద్దు

కేటీఆర్‌కు ఏసీబీ ఆదేశం

వివరాలు 2లో

# జనగణనతోనే కులగణన కూడా చేస్తాం


## తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు

కేంద్ర హోంశాఖ అధికార ప్రతినిధి క్లారిటీ

**ఢిల్లీ, మహా :** జనగణనపై కేంద్రం క్లారిటీ ఇచ్చింది. 2027లో జరగనున్న జన గణనలో భాగంగా కులాల సమాచారాన్ని కూడా సేకరిస్తామని కేంద్ర హోంశాఖ సోమవారం వెల్లడించింది. జనగణనపై కేంద్ర సర్కారు విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావన లేదంటూ కొందరు తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని తెలిపింది. "ఈసారి దేశంలో నిర్వహించనున్న జనగణనపై నోటిఫికేషన్‌ను సోమవారం అధికారిక గెజిట్‌లో ప్రచురించాం. జనగణనలో భాగంగా కులగణన కూడా జరుగుతుంది" అని హోంశాఖ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు.

మిగతా 3లో







### తగ్గనున్న బాస్మతి బియ్యం ధరలు

ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణల ఎఫెక్ట్

**మహా:** బాస్మతి బియ్యం ధరలు త్వరలోనే తగ్గనున్నాయి. ప్రస్తుతం ఇజ్రాయెల్‌తో సైనిక ఘర్షణలో ఉన్న ఇరాన్ రాబోయే రోజుల్లో భారత్ నుంచి బాస్మతి బియ్యం దిగుమతిని తగ్గించే అవకాశం ఉంది.

వివరాలు 2లో



### ఖాజాగూడ ప్రభుత్వ భూమిపై హైకోర్టులో నలుగురు ఎమ్మెల్యేల పిటిషన్

10వేల కోట్ల భూమి కబ్జాపై హైకోర్టుకు

సర్వేనెంబర్లు మార్చి కొల్లగొట్టారు

వివరాలు 3లో




### తెలంగాణకు మరో 7 కొత్త నవోదయ విద్యాలయాలు మంజూరు

- మొత్తం నవోదయాల సంఖ్య 16కు పెరుగుదల
- భద్రాద్రి, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు
- నవోదయ విద్యాలయాలపై రాష్ట్ర సర్కారు వినతులు

వివరాలు 2లో

### ములుగు జిల్లా డీఈఓ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

లంచం తీసుకుంటూ డీఈఓ పాణిని, సీనియర్ అసిస్టెంట్ పట్టివేత




వివరాలు 2లో

# అందరికీ రైతు భరోసా





(మొదటిపేజీ తరువాయి)

రైతులతో ముఖాముఖి మాట్లాడే వీలుకల్పించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 1600 వందల రైతు వేదికలకు అనుసంధానం చేసే వీడియో కాన్ఫరెన్స్ విధానానికి ముందుగా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రొ. జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం లో జరిగిన ఈ కార్యక్రమంలో రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 6.4 లక్షల మంది రైతులు పాల్గొన్నారు.

**తొమ్మిది రోజుల్లోగా.. 9వేల కోట్లు**

ఆడిటోరియంలో ప్రత్యక్షంగా హాజరైన రైతులే కాకుండా రైతు వేదికల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న లక్షలాది మంది రైతుల సమక్షంలో 1 కోటి 49 లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయంగా మీట నొక్కి 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈరోజు నుంచి వచ్చే 9 రోజుల్లోగా రైతులందరి ఖాతాల్లో నిధులు జమవుతాయని ప్రకటించారు. ఒక ఉత్సవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మంత్రివర్గ సభ్యులు, పలువురు పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, అధికారులు పాల్గొన్నారు.

**వానాకాలం రైతు భరోసా తొలిరోజు ఇలా**

ఒక్కరోజులోనే రూ.2349.83 కోట్లు చెల్లింపు
మొత్తం 41.25 లక్షల మంది రైతులకు లబ్ధి
ఎకరం లోపు రైతులకు రూ.812.6 కోట్లు విడుదల
రెండు ఎకరాల వరకు రూ.1537.2 కోట్లు చెల్లింపు
రెండు ఎకరాల లోపు రైతులకు భరోసా చెల్లింపు పూర్తి

# పదేళ్లు మన ప్రభుత్వమే...

## ఫోన్ ట్యాపింగ్ చేసి భార్యభర్తల మాటలిన్నరు

### ధరణి దోపిడీ చేస్తే.. భూ భారతి తెచ్చి రైతులకు చుట్టం చేశాం

### మేము ఎప్పుడూ జనం మధ్యలోనే ఉన్నాం.. ఫామ్ హౌస్ లో కాదు

### రైతు భరోసా నిధులు విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ హాట్ కామెంట్స్



**హైదరాబాద్, మహా:** కేసీఆర్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు దొరికిన చోటల్లా అప్పులు చేశాడని సీఎం రేవంత్ రెడ్డిఆరోపించారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందినకాడల్లా ఎగబెట్టి పోయాడు అని మండిపడ్డారు. మళ్లీ మేము అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెడుతున్నామని చెప్పారు. 18 నెలల్లో లక్ష కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం మాది సీఎం రేవంత్ అన్నారు. గ్రామాల్లో చర్చకు పెట్టండి.. ధరణి దోపిడి చేస్తే.. భూ భారతీ రైతులకు చుట్టం లెక్క మారింది.. కొత్తగా పిల్లగాడు సీఎం అయ్యిండు.. సమయం ఇద్దామని కూడా లేదు.. ఎప్పుడూ పడగొడదమా అని ఆలోచనే.. మేము ఎప్పుడూ జనం మధ్యలోనే ఉన్నాం.. మేము ఏమైనా ఫామ్ హౌస్ లో ఉన్నామా అని ప్రశ్నించారు. గత సీఎం ఎన్నిసార్లు జనంలోకి వచ్చారో ఆలోచించండి అన్నారు.

**ప్రతీ శాఖను ప్రక్షాళన చేస్తున్నాం..**

అయితే, గత పదేళ్లలో భార్య భర్తలు మాట్లాడినా వినే వాళ్ళు అని ఆరోపించారు. మేము వచ్చాకా మీరు స్వేచ్ఛగా మాట్లాడటం లేదా..? అని అడిగారు. మమ్మల్ని ఏదైనా అంటే.. స్వేచ్ఛగా అంటలేరా.. మా ప్రభుత్వంలో నలుగురు దళితులు మంత్రులు అయ్యారు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏక లింగం ఉండేది అని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పుకొచ్చారు. ప్రతీ శాఖను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. తప్పులు ఉంటే సరిదిద్దుకుంటున్నాం.. వచ్చే 9 రోజుల్లో పెట్టుబడి సాయం అందజేస్తాం..వ్యవసాయ పని ముట్లు రైతులకు ఇస్తామని వెల్లడించారు. కమర్షియల్ క్రాఫ్ వేయండి అని సూచించారు. కుటుంబంలో ఒకరు వ్యవసాయం.. ఇంకొకరు ఉద్యోగం, ఇంకొకరు వ్యాపారం చేయండి అన్నారు. సోలార్ విద్యుత్ వైపు దృష్టి పెట్టండి.. దానికి పెట్టుబడి మేము పెడతాం.. రైతులు వాడుకుని మిగిలిన విద్యుత్ అమ్ముకుంటారు.. రైతులకు సోలార్ పవర్ మీద అవగాహన పెంచండి అని సీఎస్ కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.



# కావాలంటే జైల్లో పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

అగ్రిమెంట్ల వ్యవహారమంతా అధికారులే చూసుకున్నారని, స్పాన్సర్లు చివరి నిమిషంలో వెనక్కి తగ్గడంతో హెచ్ఎండీఏ నిధులతో ఫీజులు చెల్లించాల్సి వచ్చిందని కేటీఆర్ వివరించినట్లుగా తెలుస్తోంది.

**అసెంబ్లీలో చర్చిద్దామంటే..**

తెలంగాణ ప్రతిష్టను ఆకాశమంత ఎత్తుకు తీసుకుపోయే పని చేశానే కాని తాను ఎలాంటి తప్పు, తలదించుకునే పని చేయలేదన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. నాలుగు గోడల మధ్య కాదు నాలుగు కోట్ల మంది ముందు ఫార్ములా ఈ రేసు గురించి అసెంబ్లీలో చర్చిద్దామంటే రేవంత్ రెడ్డి పారిపోయిండని విమర్శించారు. ఏసీబీ విచారణ తరువాత తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, దేశంలో ఏ రాజకీయ నాయకుడు సాహసించని లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని తానంటే రావడానికి రేవంత్ రెడ్డికి ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. ఒకవేళ ప్రభుత్వ పెద్దల నుంచి అరెస్ట్ చెయ్యాలని ఒత్తిడి ఉంటే బేషుగ్గా చేసుకోవచ్చని అధికారులకు చెప్పానన్న కేటీఆర్, అవసరమైతే తెలంగాణ కోసం మరోసారి జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమన్నారు. రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడేవారు ఎవరూ బీఆర్ఎస్ లో లేరన్నారు కేటీఆర్.

**కేటీఆర్ వ్యక్తి కాదు.. శక్తి: హరీష్ రావు**

ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ .. రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. రేవంత్ రెడ్డి 18 నెలల పాలనలో కేటీఆర్ పై 14 కేసులు పెట్టాడు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. మాట తప్పినందుకు రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలి. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి మాట తప్పిన నిన్ను ఏం చేయాలి రేవంత్ రెడ్డి? కేటీఆర్ ఈ రాష్ట్ర గౌరవాన్ని పెంచే విధంగా, భారతదేశంలో అనేక రాష్ట్రాలు ఈ ఫార్ములా రేసింగ్ కోసం పోటీపడుతుంటే తన శక్తి యుక్తులను ఉపయోగించి హైదరాబాద్కు ఫార్ములా ఈ రేసును తీసుకువచ్చారు. రేవంత్ రెడ్డి మాత్రం ఏ రాష్ట్రం కూడా అందాల పోటీలు నిర్వహించమని తేల్చి చెబితే తెలంగాణలో నిర్వహించి ఈ దేశ పరువు, రాష్ట్ర పరువు తీశాడు. అందరూ కావాలన్న ఈ కార్ రేసింగ్ను తెచ్చి రాష్ట్ర గౌరవం పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వం. ఎవరూ ముందుకు రాని అందాల పోటీలు నిర్వహించి పరువు తీసింది రేవంత్ రెడ్డి. స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలి కాబట్టి కేటీఆర్ పై తప్పుడు కేసులు పెట్టి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారు అని అన్నారు.

# దేశం విడిచి వెళ్లొద్దు

## కేటీఆర్‌కు ఏసీబీ ఆదేశం

ఫార్ములా ఈ కార్ రేస్ సమయంలో వాడిన ఫోన్లను 18 లోగా అందజేయాలని ఆదేశించినట్లు కేటీఆర్ స్వయంగా వెల్లడించారు. ఈ క్రమంలో విచారణకు మరోసారి హాజరు కావాల్సి ఉంటుందని, ఆలోగా దేశం దాటి వెళ్లొద్దని ఆదేశించినట్లుగా తెలుస్తున్నది. ఫార్ములా ఈ కార్ రేస్‌లో ఫార్ములా ఈ ఆర్గనైజేషన్స్ సంస్థ స్టేట్మెంట్ ఆధారంగా నిధుల దుర్వినియోగం, విదేశీ కంపెనీకి నగదు బదిలీపై ఏసీబీ అధికారులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించారు. కేటీఆర్‌కు సబంధించిన ఫోన్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. కేటీఆర్ తన ఫోన్లను తీసుకురాలేదని తెలిపినట్లుగా తెలుస్తున్నది. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి కేటీఆర్ సోమవారం ఏసీబీ విచారణకు హాజరయ్యారు. అడ్వకేట్ రామచంద్రరావుతో ఆయనను లోపలికి అనుమతి ఇచ్చారు. ఈ కేసులో ఏ1గా ఉన్న కేటీఆర్‌ను ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రితురాజ్, డీఎస్పీ శర్మ, కేసు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మాజీద్ ఆలీ ఖాన్ కూడిన ఐదుగురు సభ్యుల బృందం ప్రశ్నించింది.



# ములుగు జిల్లా డీఈఓ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

## లంచం తీసుకుంటూ డీఈఓ పాణిని, సీనియర్ అసిస్టెంట్ పట్టివేత

**ములుగు, మహా:** ములుగు జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈఓ) కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించి, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను రూ.20,000 లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురంలో పనిచేసే ఒక ఉపాధ్యాయుడు సిక్ లీవ్ పూర్తి చేసుకుని మళ్లీ పోస్టింగ్ కోసం జాయినింగ్ ఆర్డర్ కోరగా, ఈ అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధిత ఉపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రహస్యంగా ఆపరేషన్ చేపట్టి, డీఈఓ పాణిని, సీనియర్ అసిస్టెంట్‌ను లంచం తీసుకుంటుండగా అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌ను ములుగు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో నిర్వహించారు. ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన జిల్లా విద్యాశాఖలో కలకలం రేపింది. లంచం వ్యవహారాలు వెలుగులోకి రావడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ అధికారులు ఈ కేసుపై మరింత లోతైన దర్యాప్తు చేస్తున్నారు..



# తగ్గనున్న బాస్మతి బియ్యం ధరలు

## ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణల ఎఫెక్ట్

**మహా:** బాస్మతి బియ్యం ధరలు త్వరలోనే తగ్గనున్నాయి. ప్రస్తుతం ఇజ్రాయెల్‌తో సైనిక ఘర్షణలో ఉన్న ఇరాన్ రాబోయే రోజుల్లో భారత్ నుంచి బాస్మతి బియ్యం దిగుమతిని తగ్గించే అవకాశం ఉంది. ఈ ప్రభావంతో భారత్‌లో బాస్మతి బియ్యం ధరలు తగ్గుముఖం పట్టే ఛాన్స్ ఉందని అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ వెల్లడించింది. ఏపీఈడీఏ ప్రకారం, భారత్ నుంచి అత్యధికంగా బాస్మతి బియ్యాన్ని దిగుమతి చేసుకునే దేశాల్లో మూడో స్థానంలో ఇరాన్ ఉంది. తొలి రెండు స్థానాల్లో సౌదీ అరేబియా, ఇరాక్ ఉన్నాయి. 20242025 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి ఇరాన్‌కు రూ.6,374 కోట్లు విలువైన బాస్మతి రైస్ ఎగుమతి జరిగింది. ఆ సంవత్సరంలో విదేశాలకు భారత్ ఎగుమతి చేసిన మొత్తం బాస్మతి బియ్యంలో ఇది 12.6 శాతానికి సమానం. ఇజ్రాయెల్‌తో సైనిక ఘర్షణల వల్ల ఇరాన్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో రాబోయే వారాల్లో ఇరాన్ నుంచి భారత్‌కు భారీగా బాస్మతి బియ్యం ఆర్డర్లు తగ్గే అవకాశం ఉంది. ఈ ప్రభావంతో భారత్‌లో బాస్మతి బియ్యం ధరలు దిగి వస్తాయని ఏపీఈడీఏ పేర్కొంది.

# రేవంత్ రెడ్డిని కేటీఆర్ రెచ్చగొడుతున్నారు

## ఆయనకు జైలుకు వెళ్ళాలన్న కుతూహలం ఉంది: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు జైలుకు వెళ్లాలని కుతూహలంగా ఉన్నట్లు కనిపిస్తోందని రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ విచారణకు హాజరయ్యే ముందు కేటీఆర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె ఈ విధంగా స్పందించారు. వీలైనంత త్వరగా జైలుకు వెళ్లేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ రెచ్చగొడుతున్నారని సీతక్క అన్నారు. "కల్వకుంట్ల కవిత జైలుకు వెళ్లివచ్చి బీసీ ఎజెండాను అందుకున్నారు. తాను వెనుకబడ్డాననే భావనతో కేటీఆర్ కూడా జైలుకు వెళ్లి ఏదైనా పథకం రచించాలని అనుకుంటున్నారేమో" అంటూ వ్యంగ్యంగా అన్నారు. కేటీఆర్ మాటల్లో పొగరు కనిపిస్తోందని ఆమె మండిపడ్డారు. ఏదో ఆశించే కేటీఆర్ జైలుకు వెళ్లాలని అనుకుంటున్నారని, తొడేళ్లలా దోచుకుని ఇప్పుడు వినయం నటిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. "కేటీఆర్ పొగరుతో మాట్లాడుతుంటే, తమ ముఖ్యమంత్రి పౌరుషంతో మాట్లాడుతున్నారు" అని సీతక్క వ్యాఖ్యానించారు. కేటీఆర్ వ్యవహారాన్ని దర్యాప్తు సంస్థలే చూసుకుంటాయని ఆమె స్పష్టం చేశారు.

# తెలంగాణకు మరో 7 కొత్త నవోదయ విద్యాలయాలు మంజూరు

## మొత్తం నవోదయాల సంఖ్య 16కు పెరుగుదల

### భద్రాద్రి, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు నవోదయ విద్యాలయాలపై రాష్ట్రసర్కారు వినతులు

**హైదరాబాద్, మహా:**

తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి కొత్తగా మరో ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలను (జేఎన్‌వీ) మంజూరు చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను సోమవారం జారీ చేసింది. గత ఏడాది డిసెంబర్‌లోనే ఈ కొత్త విద్యాలయాల ఏర్పాటుకు సూత్రప్రాయంగా ఆమోదం లభించినప్పటికీ, ఇప్పుడు పరిపాలనాపరమైన అనుమతులు ఖరారయ్యాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో నాణ్యమైన విద్య మరింత మంది విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి అందుబాటులోకి రానుంది. నవోదయ విద్యాలయాలపై రాష్ట్రసర్కారు పలుమార్లు వినతులు అందించింది.

**కొత్త విద్యాలయాలు ఏర్పాటయ్యే జిల్లాలు**

కేంద్రం తాజాగా మంజూరు చేసిన ఏడు నవోదయ విద్యాలయాలను భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం తెలంగాణలో కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, కామారెడ్డి, వరంగల్, రంగారెడ్డి, సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లో కలిపి మొత్తం 9 నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ఈ కొత్త వాటితో కలిపి రాష్ట్రంలో జేఎన్‌వీల సంఖ్య 16కు చేరుతుంది

# వాట్సప్‌లో త్వరలో యాడ్స్

## అప్‌డేట్స్ ట్యాబ్‌లో ఇకపై ప్రకటనలు

### ఛానెల్స్‌కు సబ్‌స్క్రిప్షన్ ఫీజు

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** మెటా యాజమాన్యంలోని మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ తన అప్డేట్స్ ట్యాబ్‌లో అనేక కొత్త ఫీచర్లను లాంచ్ చేయబోతోంది. ఇప్పటికే స్టేటస్, ఛానల్స్‌కు అంకితమైన ఈ ట్యాబ్‌ను ఇప్పుడు మరింత ఉపయోగకరంగా, ఆసక్తికరంగా మార్చేందుకు సిద్ధం అవుతోంది. ఈ ట్యాబ్‌లో గత ఏడాది కాలంలో చేసిన మార్పులు వాట్సాప్‌లో కొత్తగా ఏదైనా సెర్చ్ చేసే అనుభవాన్ని యూజర్లకు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ 1.5 బిలియన్లకు పైగా ప్రజలు ఈ అప్డేట్స్ ట్యాబ్‌ను ఉపయోగిస్తున్నారని యాప్ పేర్కొంది. ఈ ఫీచర్‌ను రోజూ ఉపయోగించే అడ్మిన్లు, గ్రూపులు, వ్యాపారాలకు మరింత మద్దతును అందించడమే లక్ష్యంగా మార్పులు చేశారు. అయితే ఈ ఫీచర్లన్నీ అప్‌డేట్స్ ట్యాబ్‌లో కనిపిస్తాయి. మీరు వాట్సాప్‌ను కేవలం పర్సనల్ చాట్స్ కోసం మాత్రమే ఉపయోగిస్తే ఈ మార్పులు కనిపించవు.

**స్టేటస్ యాడ్స్..**

ఇప్పుడు ఛానల్స్, బిజినెస్‌లు స్టేటస్ ట్యాబ్‌లో తమ యాడ్స్‌ను చూపించగలవు. దీని ద్వారా ప్రొడక్ట్ లేదా సర్వీస్‌కు సంబంధించిన చాట్‌ను ప్రారంభించడానికి యూజర్లకు సులభమైన అవకాశం లభిస్తుంది. ఇది బిజినెస్ కమ్యూనికేషన్‌కు ప్రత్యేక అవకాశాలను ఇస్తుంది. వాట్సప్ ఈ ఫీచర్లన్నింటినీ సిద్ధం చేసేటప్పుడు ప్రైవసీ విషయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకుంది. మీ వ్యక్తిగత సందేశాలు, కాల్స్, స్టేటస్లు ఇప్పటికీ ఎండ్‌టుఎండ్ ఎన్క్రిప్ట్ ఉంటాయని, వాటిని ఎవరూ చూడలేరని లేదా వినలేరని కంపెనీ పేర్కొంది.

**ఛానల్ సబ్‌స్క్రిప్షన్..**

ఇప్పుడు యూజర్లు తమకు ఇష్టమైన ఛానెల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. దీని కోసం వారు నెలవారీ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రత్యేకమైన కంటెంట్ లభిస్తుంది. ఈ ఫీచర్ ద్వారా ఛానల్ అడ్మిన్లకు రెగ్యులర్ సపోర్ట్ పొందే అవకాశం లభిస్తుంది.

# పోలవరం మార్పులను తిరస్కరించండి

## కేంద్ర మంత్రి భుపెందర్ యాదవ్ కు మంత్రి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్,మహా:** పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన టి.ఓ.ఆర్ మార్పులను కేంద్రప్రభుత్వం తిరస్కరించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కేంద్రపర్యావరణ,అటవీ శాఖామంత్రి భుపెందర్ యాదవ్ కు బహిరంగ లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యావరణ అనుమతులతో పాటు ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంగిస్తున్నారని,ఇది ముమ్మాటికి పక్క రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం వాటిల్ల చేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రాజెక్టుల విస్తరణకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తో పాటు సాంకేతిక సలహా మండలి సూచబలకు విరుద్ధంగా అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖా నుండి 2005 అక్టోబరు 25 న జె12011/74/2005I ఏ1 ద్వారా అనుమతి లభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాలక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎటువంటి అనుమతులు లేకుండానే భారీ మార్పులకు శ్రీకారం చుట్టిందని ఆయన ఆరోపించారు. ఇదే విషయమై 2011 ఫిబ్రవరి 8 న కేంద్రం పనులను నిలిపి వేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన చెప్పారు. అయితే 2026 జులై 2 వరకు ఈ ఉత్తర్వులు పొదగించాలని ఆయన ఆ లేఖలో డిమాండ్ చేశారు. ఇదే అంశంపై తెలంగాణా రాష్ట్రంతో పాటు ఛత్తీస్ ఘడ్ ,ఒడిశా రాష్ట్రాలు వ్యతిరేకత వ్యక్తం చేసినప్పటికీ పనులు కొనసాగడంపై ఆయన తీవ్ర ఆక్షేపణ తెలిపారు. పోలవరం ప్రాజెక్టును భారత ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ ప్రాధమికంగా ఆమోదించిన భాగాలకు మాత్రమే నిధులు రీఎంబర్స్మెంట్ కొనసాగుతుందన్నారు.అయినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనల ఉల్లంఘనకు పాల్పడి భారీ మార్పుల చేపట్టిందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ప్రాజెక్టు విస్తరణ పై 2022 సెప్టెంబర్ 6 న అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రాజెక్టు విస్తరణ పై సాంకేతిక నివేదికలు అవసరం అవుతాయని పేర్కొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ఆ లేఖలో ప్రస్తావించారు. పైగా పర్యావరణ అనుమతులు అవసరం ఉందన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ లేఖలో ఉటంకించారు. ఇటువంటి సమస్యల పరిష్కారానికి కేంద్ర జలశక్తి మంత్రితో పాటు యం.ఓ.ఇ.ఎఫ్./సి.సి అన్ని పక్షాలతో సమావేశం కావాలని సూచించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం మొదట ఆమోదించిన ప్రమాణాల ఉల్లంఘనకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉల్లంఘనలకు పాల్పడడమే కాకుండా కుడి కాలువ హెడ్ స్లూయిస్ నుండి 20 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం నుండి 40 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యానికి పెంచుతూ డిజైన్ లో మార్పులు చేసిందన్నారు. వాస్తవానికి రెండు టన్నేళ్ళు కూడా 20 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం తో నిర్మాణంలో ఉన్నాయని ఆయన వివరించారు. పైగా హెడ్ వర్క్స్కు అవసరమైన మౌళిక సదుపాయాలు ఇప్పటికే నిర్మించ బడ్డాయన్నారు. పి.ఐ.పి.ఆర్. యం.సి ని 11,654 క్యూసెక్కులకు డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్ లో ఆమోదించినప్పటికి 17,560 క్యూసెక్కుల సామర్థ్యం తో నిర్మాణం జరుగు తొందన్నారు. అంతే గాకుండా పోలవరం ఎడమ కెనాల్ ను కూడా అంతే సామర్థ్యంతో నిర్మిస్తున్నారన్నారు ఆమోదం పొందిన సామర్థ్యం కేవలము 8,123 క్యూసెక్కులేనని,అందుకు భిన్నంగా ప్రాజెక్టు డిజైన్ మార్చి ఎటువంటి అనుమతులు లేకుండానే పనులు కొనసాగుతున్నాయన్నారు.



# మంత్రి పొంగులేటిపై పీసీసీ చీఫ్ ఆగ్రహం

## పార్టీలో చర్చించకుండా ప్రకటనలు వద్దు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశంతో ముడిపడి ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలపై పొంగులేటి ప్రకటన చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. క్యాబినెట్‌లో చర్చించాల్సిన అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అని సీరియస్ అయ్యారు. పార్టీలో చర్చించకుండా అలాంటి ప్రకటనలు చేయొద్దన్నారు. ఒకరి మంత్రిత్వశాఖ అంశంపై వేరొకరు మాట్లాడటం ఏంటని మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై మంత్రులు మాట్లాడేటప్పుడు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. మంత్రులు వారి శాఖల పరిధిలోని అంశాలపైనే మాట్లాడాలని.. సున్నిత, కోర్టు పరిధిలోని అంశాలపై మాట్లాడేప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు.

## పార్టీ బతకాలంటే
# మార్పు కావాలె!

### బీఆర్ఎస్‌లో అంతర్గత మార్పులు జరగాలి

మా పార్టీలోని లోపాలను సవరించుకుంటాం

తెలంగాణ భవన్‌కు తాళం వేయడం దుర్మార్గం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు



**జగిత్యాల, మహా:** గులాబీ పార్టీ అగ్ర నేతలపై ధిక్కార స్వరం వినిపిస్తూ గత కొద్ది రోజులుగా తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని నవదుర్గ అమ్మవారి ఆలయం వార్షికోత్సవంలో కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలో మార్పులు చేర్పులు జరగాలని కోరుకోవడం సహజమన్నారు. పార్టీలోని కార్యకర్తల కోసం, వారి హక్కుల కోసం మాట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. పార్టీ బతకాలి అంటే మార్పులు కావాలని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసిన కవిత.. ఇదే సమయంలో పార్టీ మీద ఎవరైనా దాడి చేస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారని.. ప్రజా సమస్యల నుండి దృష్టి మరల్చడం కోసమే నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. వేధింపులకు భయపడే వాళ్ళం కాదు.. ప్రభుత్వం ఇకనైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలని.. అధికార పార్టీ దాడులను తిప్పికొడతామన్నారు. కేటీఆర్ ఏసీబీ విచారణ సందర్భంగా తెలంగాణ భవన్‌కి తాళం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయట్లేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతన్నలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారన్నారు. 'పింఛన్లు పెంచలేదు.. మహిళలకు రూ.2,500 ఇవ్వలేదు.. ఇలా అన్ని హామీలను కాంగ్రెస్ ఎగవేసింది. మొన్ననే కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్‌ను విచారించింది. ఇప్పుడు కేటీఆర్‌ను ఏసీబీ విచారిస్తోంది. మేం వేధింపులకు భయపడే వాళ్ళం కాదు.. కేటీఆర్ విచారణకు హాజరయ్యారు. కేటీఆర్ విచారణ సందర్భంగా ఈ ప్రభుత్వం తెలంగాణ భవన్ తాళం వేయడం దుర్మార్గం. మా కార్యకర్తలు, నాయకులను బయటికి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణం. మా పార్టీ లోపాలను సవరించుకుంటాం.. మా మీద ఎవరైనా దాడికి వస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటాం' అని వాఖ్యానించారు.

## వైద్య కళాశాలల పనులపై
# కార్యాచరణ ప్రణాళిక

- కళాశాలల్లో క్షేత్ర స్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ
- మూడేళ్లలో అన్ని కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో ఉండాలి
- నర్సింగ్ కళాశాలల్లో ఆప్షనల్‌గా జపనీస్ ఉండాలి
- వైద్యారోగ్య సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రతి నెల వైద్యారోగ్య, విద్యా శాఖలపై సమీక్ష



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి... ఎంత మేర నిధులు కావాలి.. తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు... ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఐసీసీసీలో సోమవారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి ప్రమోషన్లు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ వీటన్నింటిపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని, కేంద్ర మంత్రి నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష) ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆసుపత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, వైద్యారోగ్య శాఖ డైరెక్టరేట్ డాక్టర్ నరేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఖాజాగూడ ప్రభుత్వ భూమిపై

## హైకోర్టులో నలుగురు ఎమ్మెల్యేల పిటిషన్

### 10వేల కోట్ల భూమి కబ్జాపై హైకోర్టుకు

### సర్వేనెంబర్లు మార్చి కొల్లగొట్టారు

**హైదరాబాద్, మహా :** తెలంగాణ హైకోర్టులో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి, మురళినాయక్‌లు పిల్ దాఖలు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటూ ఎమ్మెల్యేలు పిల్ వేశారు. ఈ పిటీషన్‌పై సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఖాజాగూడలోని సర్వే నెం.119, 122లో ఉన్న 27.18 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని న్యాయవాది కోర్టుకు వివరించారు. . ఖాజాగూడ సర్వే నెం.119,122 లో ఉన్న 27 ఎకరాల రూ.10 వేల కోట్ల విలువైన భూమిని సర్వే నెంబర్లు మార్చి ఆక్రమించారని పిటిషనర్ల తరపున న్యాయవాది వాదించారు. 2023 లో రంగారెడ్డి కలెక్టర్ నో అబ్జెక్షన్ లెటర్ ఇవ్వడంతో జిహెచ్ ఎంసి భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని, ప్రస్తుతం ఆ స్థలంలో 47 అంతస్తులు గల 8 టవర్లను నిర్మిస్తున్నారని తెలిపారు. ఇవన్నీ ఖాజాగూడ చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. కబ్జాకు గురైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా ఆదేశించాలని కోర్టును కోరారు. అనంతరం.. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి, రెవెన్యూ కార్యదర్శికి, రంగారెడ్డి కలెక్టర్ కి, జిహెచ్ఎంసి కి, హైడ్రాకు నోటీసులు జారీ చేసి, విచారణను రెండు వారాలకు ధర్మాసనం వాయిదావేసింది.

## కిషన్ రెడ్డి ఇంటి ముందు
# చేయండి ధర్నా..

- నగర అభివృద్ధికి ప్రధాన అడ్డంకి కేంద్ర ప్రభుత్వమమే
- రూపాయి తెచ్చే దిక్కులేదు కానీ రాజకీయ స్టంట్లు చేస్తున్నారా?
- జీహెచ్ఎంసీ ఆఫీస్ ఎదుట బీజేపీ నాయకుల ధర్నాపై మంత్రి పొన్నం ధ్వజం



**హైదరాబాద్, మహా:** బీజేపీ నేతలు ధర్నా చేయాల్సింది జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు కాదు.. హైదరాబాద్ నగరం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. హైదరాబాద్ లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు నిర్వహించిన ధర్నాపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. జీహెచ్ఎంసీ అభివృద్ధిపై బీజేపీ చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. ఈ విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర అభివృద్ధికి కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా తెచ్చేందుకు ప్రయత్నించకుండా బీజేపీ నాయకులు రాజకీయ స్టంట్లు వేయడం సరికాదని విమర్శించారు.

**మేము కూడా వస్తాం..**

నగర అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా కేంద్ర ప్రభుత్వం మారిందని, దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వైఫల్యమే కారణమని తెలిపారు. జీహెచ్ఎంసీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఈ విధమైన రాజకీయాలు చేయడం కన్నా, కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తే మేము కూడా వస్తాం అని మంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ అభివృద్ధికి అందరం కలిసి నిధులు తీసుకురావాలన్న మంత్రి, ఈ విషయాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని అన్నారు. నగర అభివృద్ధి మా బాధ్యత. రాజకీయాలు దానికి అడ్డుకావద్దు అని హెచ్చరించారు. మొత్తంగా కేంద్రం నుండి నిధులు తీసుకురావడానికి బీజేపీ నాయకులు తమ సొంత నేత కిషన్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.



## రైతు భరోసా మొత్తం డబ్బులు
# జమ చేస్తాం

### రైతు పండించే ప్రతి ఎకరాకు రైతు భరోసా

రైతుల కోసం ప్రతి సంవత్సరం 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం

కాంగ్రెస్ కు వ్యవసాయానికి విడదీయరాని అనుబంధం

రైతు నేస్తం సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా:** రానున్న తొమ్మిది రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలోని అన్నదాతల అందరి ఖాతాల్లోకి రైతు భరోసా డబ్బులు మొత్తం జమ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైతు నేస్తం సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీటనొక్కగానే రైతు ఖాతాల్లోకి టింగ్ టింగ్ మంటూ రైతు భరోసా నిధులు జమ అవుతాయని డిప్యూటీ సీఎం వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలోని సాగు యోగ్యమైన, రైతన్నలు సాగు చేసుకుంటున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్ని ఎకరాలు సాగు చేస్తే ఆ మొత్తం ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ అవుతాయి, ఎలాంటి లిమిట్ లేదు అన్నారు. రాష్ట్రంలో సాగులో ఉన్న 1.49 కోట్ల పైబడి ఎకరాలకు ఎకరాకు 12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతాయి అన్నారు. భూమిలేని నిరుపేదలు వారు వ్యవసాయ కూలీలుగా ఉంటూ రైతుల పక్షాన నిలబడుతున్న పేదలకు కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 12,000 చొప్పున ప్రజా ప్రభుత్వం చెల్లిస్తుంది అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూపాయి, రూపాయి పోగుచేసి రైతులు, రాష్ట్ర ప్రజల పక్షాన సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు. రైతుల కోసం ప్రజా ప్రభుత్వం ప్రతి సంవత్సరం 70 వేల కోట్ల చొప్పున ఐదు సంవత్సరాలలో మొత్తం 3.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇలా ఒకటి తర్వాత ఒకటి సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటూ పోతే ఇక మాకు పుట్టగతులు ఉండవని పదేళ్లు పాలించిన వారు ప్రజా ప్రభుత్వం పై బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టిన విషయం రాష్ట్ర ప్రజలు గుర్తించాలి అన్నారు. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల కోసం ఈ ప్రభుత్వం నిటారుగా నిలబడింది అన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు అరచేతిలో పెట్టుకొని ఆశీర్వదించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు కావాల్సిన సహాయ, సహకారాలు అందిస్తుంటే టిఆర్ఎస్ నేతలు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు.. వారు దయ్యాలు అని ఆ పార్టీ నేతలే చెప్పారు, ఆ దయ్యాలు నేడు వికట్టహాసం చేస్తున్నాయి, దయ్యాలు ఊర్లో ఉంటే అరిష్టం ఆ దయ్యాలను ఊరి పొలిమేరలోకి రానివ్వకుండా తరిమికొట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

రైతులు సుభిక్షంగా ఉండాలి పంటలు పచ్చగా పండాలి రైతన్నలు ఆనందంగా ఉండేందుకు రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ఈ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది అని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అన్నారు.

రైతులు అంటేనే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటేనే రైతులు అని డిప్యూటీ సీఎం తెలిపారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలకు విడదీయరాని అనుబంధం ఉంది అని అన్నారు. ఉచిత కరెంటు, రుణమాఫీ, పంటలకు మద్దతు ధర, మద్దతు ధరకు తో పాటు సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. ఎవరు ఊహించని విధంగా గత ప్రభుత్వాలు తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి ఆపకుండా రైతు సోదరుల కోసం అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నాం అన్నారు అధికారంలోకి వచ్చిన మూడు నాలుగు నెలల వ్యవధిలోనే రైతు రుణమాఫీ కింద 21 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసాం అన్నారు. ఇంతటి గొప్ప సాహసం భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదు అన్నారు. గత పాలకులు వెళ్లేముందు రైతు భరోసా వదిలేసి వెళ్లిపోతే క్యాబినెట్లో తీర్మానం చేసి రైతు భరోసా కింద 13,088 కోట్లు జమ చేసాం అన్నారు. సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ కింద 1,199 కోట్లు విడుదల చేసాం అని తెలిపారు. టిఆర్ఎస్ నేతలు రైతుల భీమా గురించి మర్చిపోయారు, ఆ రాడు రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా పంట నష్టం జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన పట్టించుకోలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడైనా పంట నష్టం జరిగితే లెక్క గట్టి రైతుల ఖాతాల్లో జమ చేశారు, కానీ 10 సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ నేతలు ఆలోచన చేయలేదని డిప్యూటీ సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పంట నష్టం కింద 260 కోట్లు విడుదల చేశాం, రైతుల ఇన్సూరెన్స్ కోసం 2,181 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు రాష్ట్రంలోని 29 లక్షల పంపుసెట్లకు ఉచితంగా 24 గంటల కరెంటు సరఫరాకు 16,691 కోట్లు రైతుల పక్షాన ఆర్థిక శాఖ నుంచి విద్యుత్ శాఖ అధికారులకు చెల్లింపులు చేస్తుందని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు 11 వేల కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు.



# జైలుకెళ్తే సీఎం కావు

- కేటీఆర్‌పై ఎంపీ చామల సెటైర్లు
- హీరో మహేశ్ బాబును కాపీ కొడుతుండు
- కుట్రలు, కుతంత్రాలకు కేసీఆర్ కుటుంబం నిలయం

**హైదరాబాద్, మహా:** హీరో మహేష్‌బాబును మాజీ మంత్రి కేటీఆర్ కాపీ కొడుతున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సెటైర్లు గుప్పించారు. ఫార్ములా వన్ రేసు కేసులో అరవింద్ కుమార్ కీలకమైన వ్యక్తి అని తెలిపారు. ఐఏఎస్ అరవింద్ కుమార్ ఎక్కడున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి ఉందని అన్నారు. అరవింద్ కొన్ని రోజులుగా కనపడటం లేదని చెప్పారు. అసలాయన అరవింద్ లేడు కాబట్టి ఏం కాదని కేటీఆర్ అనుకుంటున్నారని చెప్పుకొచ్చారు. వీళ్ల అవసరాల కోసం, తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఏమైనా చేస్తారని ఆరోపించారు. గతంలో కేటీఆర్ మిత్రుడు కేదార్‌నాథ్ దుబాయ్‌లో చనిపోయారని గుర్తుచేశారు. కేటీఆర్ ప్లాన్‌తోనే ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లి దాక్కున్నారని ఆరోపణలు చేశారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.

## కవిత జైలుకి వెళ్లింది ఢిల్లీలో..

భరత్ అనే నేను సినిమాలో మహేష్‌బాబు లాగా కేటీఆర్ ఫీల్ అవుతున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌వీ సినిమా డైలాగులేనని దెప్పిపొడిచారు. జైలుకెళ్తే సీఎం అవుతారనే ట్రెండ్‌ని కేటీఆర్ బలంగా నమ్ముతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత జైలుకి వెళ్లింది ఢిల్లీలో, తాను హైదరాబాద్‌లో జైలుకెళ్తే తానే సీఎం అవుతానని కేటీఆర్ తన సన్నిహితుల దగ్గర చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఉద్యమకారుడు కాదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు కాబట్టే విచారణ జరుగుతోందని అన్నారు. కేటీఆర్ అరెస్ట్ కావాలనే ఓవర్ యాక్టింగ్ చేస్తున్నారని చెప్పారు. కుట్రలు, కుతంత్రాలకు కేసీఆర్ కుటుంబం నిలయమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

# జనగణనతోనే కులగణన కూడా చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)




"జనగణనలో భాగంగా కులగణన కూడా జరుగుతుందని ఈ ఏడాది ఏప్రిల్ 30, జూన్ 4, జూన్ 15 తేదీల్లో మేం (కేంద్ర హోంశాఖ) విడుదల చేసిన ప్రెస్ రిలీజ్‌లలో ప్రస్తావించాం. అయినా కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు" అని వెల్లడించారు.

**కేంద్రం మరో యూటర్న్ తీసుకుందా?- కాంగ్రెస్ నేత జైరాం రమేష్**

16వ జనగణనలో భాగంగా కులగణన చేపడతామని కేంద్ర సర్కారు గతంలో చెప్పింది. సోమవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో కులం అనే ప్రస్తావనే కనిపించలేదు. ఈవిషయంలోనూ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందా?" అని ప్రశ్నిస్తూ సోమవారం రోజు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని మోదీ సర్కారు యూటర్న్‌ల ఉస్తాద్‌గా మారిందని ఆయన విమర్శించారు. కులగణనను నిర్వహించడంలో, కులాలవారీగా ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర నమూనాను అనుసరించాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు.

**అధికారికంగా ప్రక్రియ షురూ**

జనగణనపై కేంద్ర సర్కారు గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడంతో సోమవారం జూన్ 16 నుంచే జనాభా లెక్కింపు ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైనట్లుగా భావించాలి. రెండు దశల్లో జనగణన ప్రక్రియను నిర్వహించనున్నారు. మంచు ఎక్కువగా ఉండే జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో 2026 అక్టోబరు 1 అర్ధరాత్రి కల్లా జన గణనను పూర్తి చేస్తారు. దేశవ్యాప్తంగా మిగతా అన్ని ప్రాంతాల్లో 2027 మార్చి 1 నాటికి జనాభా లెక్కలను పూర్తి చేస్తారు. మన దేశంలో 15 ఏళ్ల తర్వాత జరగనున్న ఈ జనగణనలో 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలో కొనసాగుతుంది. ప్రభుత్వం సూచించే అధికారిక పోర్టల్స్, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటును సైతం కల్పిస్తారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతామని పేర్కొంది.

# శిక్ష అనుభవించాల్సిందే..

- తప్పుచేసిన వారు ఎవరైనా ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా
- కేసీఆర్, కేటీఆర్, కవితలది పైసల పంచాయితీ
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**సిద్దిపేట, మహా:**

కాంగ్రెస్ ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు పోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. తప్పుచేసిన వారు ఎవరైనా ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేసులు ఎదుర్కొవాల్సిందే..శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీహెచ్ఆర్ నగర్‌లో హాస్టల్ ప్రహరీ గోడకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏబీఎన్‌తో ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. విచారణ నిజాయితీగా జరగాలని కోరారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందనేది అందరూ చెబుతున్న మాట అని చెప్పారు. కాళేశ్వరం అవినీతికి గత ముఖ్యమంత్రి కేసీఆర్, గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులు, అధికారులు బాధ్యత వహించాలని, విచారణ త్వరగా పూర్తి చేయాలని ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు.

**బీజేపీని కనపడనీయకుండా చేసేందుకు..**

18 నెలలుగా కాళేశ్వరం విచారణ కమిషన్ సమయాన్ని రేవంత్ ప్రభుత్వం రెండేసి నెలలుగా పెంచుకుంటూ పోవడంతో ప్రజల్లో కక్ష సాధింపు చర్యలనే అనుమానం కలుగుతోందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తెలంగాణలో ఎదుగుతున్న బీజేపీని కనపడనీయకుండా చేసేందుకు కుట్ర చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవితలది ఇంటి సమస్య, పైసల పంచాయితీ, రాజకీయ వారసత్వ పంచాయితీ అని ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. కవిత ఏం మాట్లాడుతుందో ఆమెకే తెల్వదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు తాము అధిక ప్రాధాన్యం ఇస్తామని.. పోటీ చేసే వారిని తప్పకుండా గెలిపించుకుంటామని ఉద్ఘాటించారు.



## మాజీ మంత్రి హరీష్‌కు
# అస్వస్థత


### సికింద్రాబాద్ ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. జ్వరంతో సికింద్రాబాద్ సన్ సైన్ ఆసుపత్రిలో చేరారు. సోమవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో స్వల్ప అస్వస్థతకు హరీశ్‌రావు గురయ్యారు. అక్కడే బీపీ పరీక్షించుకున్నారు. అనంతరం సికింద్రాబాద్‌లోని ఆసుపత్రిలో చేరారు.

Z కేటగిరి

# రేవంత్ రణతంత్రపుటెత్తులకు కేసీఆర్ ఆగమాగం!!

'ముందుగా వైరిపక్షం అస్త్రాలు ఖాళీ చేసేలా చూడడం యుద్ధంలో విజయానికి మొదటి సూచిక"అని పాండవులకు శ్రీకృష్ణుడు చెప్పిన సూత్రం.ఇప్పుడు అదే పనిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ఆయన ఆ ప్రయత్నాలు చేయకపోయినా అంతఃపుర తగాదాలతో,ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ తో బిఆర్ఎస్ దానంతట అదే నిర్వీర్యమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నవి.పదేండ్ల పరిపాలనలో బిఆర్ఎస్ సాధించిన విజయాలేమిటో చెప్పుకోదగినది ఒక్కటీ లేకుండా రేవంత్ చేశారు.కాళేశ్వరం గురించి ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాన ప్రతిపక్ష పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ ప్రాజెక్టు గురించి ఎందుకు ప్రచారం చేయలేదు? పోనీ 2024 లోక్ సభ ఎన్నికల్లో అయినా కాళేశ్వరంపై ప్రచారం చేయకపోవడానికి కారణాలేమిటి? గడచినా ఏప్రిల్ 27 న వరంగల్ లో జరిగిన పార్టీ రజతోత్సవ సభలో కేసీఆర్ కాళేశ్వరం ఊసు ఎందుకు ఎత్తలేదు? అలాగే దళిత బంధు అట్టర్ ఫ్లాప్ పథకంగా తేలిపోయింది.



రైతుబంధు పేరిట 27 వేల కోట్ల రూపాయలు తమ బినామీల పేరిట బిఆర్ఎస్ నాయకులు దోపిడీ చేసినట్టు అసెంబ్లీలో ముఖ్యమంత్రి 'దాడి' చేస్తే ప్రతిపక్షం ఉక్కిరిబిక్కిరి అయ్యింది.సాగులో లేని భూములకు,రియల్ ఎస్టేట్ చేస్తున్న భూములు,క్రషర్లు,ఇతర వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తున్న భూములు,చివరకు నేషనల్ హైవేలోని భూములకు కూడా రైతుబంధు పేరిట ప్రజాధనం దుర్వినియోగమైనట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నవి.మిషన్ భగీరథ,మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలలో జరిగిన కుంభకోణాలపై కూడా దర్యాప్తు జరపనున్నట్టు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు తెలిపారు.చేపలు ,గొర్రెలు,బర్రెల పంపిణీ వంటి పలు కార్యక్రమాల్లోనూ ప్రజాధనమంతా బిఆర్ఎస్ నాయకులు,లేదా ఆ పార్టీ ముఖ్యుల జేబుల్లోకి వెళ్లిపోయినట్లు ఆరోపణలు వస్తున్నవి.అన్నింటికన్నా దారుణమైన సంఘటన ఫోన్ ట్యాపింగ్.ఎస్.ఐ.బి.మాజీ చీఫ్ ప్రభాకరరావు కనుసన్నల్లో జరిగినట్టు చెబుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ దశలో ఉన్నది.కాంగ్రెస్,బీజేపీ,లెఫ్ట్ పార్టీలు,బిఆర్ఎస్ కు వ్యతిరేకంగా మాట్లాడే వ్యక్తులు,విలేకరులు,చివరకు తమ సొంత కుటుంబ సభ్యులు,కొందరు హైకోర్టు జడ్జీల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్టు
ఈ కేసులో అరెస్టయిన పోలీసు అధికారులు తమ వాంగ్మూలంలో చెప్పినట్టు ప్రచారం సాగుతోంది.

''మావోయిస్టులతో సంబంధాలున్న వారు,వారికి సహకరిస్తున్నట్టుగా అనుమానిస్తున్న రాజకీయ నాయకులు ,పోలీసు అధికారులు,కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారుల ఫోన్లు ట్యాప్ చేసాం'' అని ప్రభాకరరావు 'సిట్' విచారణలో తెలిపినట్లుగా జూన్ 14 న వార్తా కథనాలు వెలువడ్డాయి.ప్రభాకరరావు చెబుతున్నదే నిజమని అనుకుంటే తెలంగాణలో మావోయిస్టుల మద్దతుదారులు బలంగా ఉన్నట్టు లెఖ్ఖ.వారికి పోలీసు శాఖలోనే 'కోవర్టులు' ఉన్నట్టు లెఖ్ఖ.కొందరు ప్రజాప్రతినిధులు సైతం మావోయిస్టులకు సహకారం అందిస్తున్నట్టు లెఖ్ఖ. ప్రభాకరరావు కథనమంతా వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయి.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్నంతా మావోయిస్టులపైకి తోసిపారేసే పథకం ఎవరూ నమ్మేలా లేదు. ఫోన్ ట్యాపింగ్ చట్టరీత్యా నేరం కనుక,ఈ వ్యవహారం వెనుక బిఆర్ఎస్ 'ముఖ్యులు' ఉన్నందున వారిని రక్షించేందుకు ప్రభాకరరావు పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే కేసులో నిందితుడు అయిన ప్రణీత్ రావు ఇదివరకే 'నిజం కక్కేశాడు'.2023 ఎన్నికల్లో కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడానికి 'వైరిపక్షాల అస్త్రాలను ఖాళీ చేయడానికి ఫోన్లు ట్యాప్ చేసాం' అని ప్రణీత్ రావు 'సిట్' ఎదుట అంగీకరించినట్టు ప్రచారం ఉన్నది.ప్రణీత్ రావు,ప్రభాకరరావు వాంగ్మూలాలకు పొంతన లేదు.కనుక వాళ్ళిద్దరినీ ముఖాముఖి కూర్చోబెట్టి ప్రశ్నించేందుకు 'సిట్' ప్రయత్నిస్తోంది.ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ 'ప్రముఖుల' గుట్టు రట్టయితే,ఇక వాళ్ళు 2028 ఎన్నికల్లో ప్రజలకు ఎలా మొహం చూపుతారు?

తెలంగాణ ఉద్యమాన్ని ఆలంబనగా చేసుకొని ఆవిర్భవించిన టిఆర్ఎస్ తొలి ప్రభుత్వాన్ని మొదటి దఫా ప్రజలు ఆదరించినప్పటికీ ఆ ప్రభుత్వం తిరోగమన ధోరణి,అణచివేత నిర్బంధం కారణంగా బుద్ధిజీవులు,మేధావులు,ప్రజలు సామాన్య కార్యకర్తలు ,ప్రజా సంఘాలలో వ్యతిరేకత పెల్లుబికింది. తాను ముఖ్యమంత్రిగా ఉండనని దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి,నిట్ట నిలువునా ద్రోహం చేసిన విషయం తెలిసిందే.ఇక ప్రతి ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో "కుర్చీ వేసుకుని కూర్చుంటానని,మాట తప్పితే తల నరుక్కుంటానని,కావలి కుక్కలాగా పని చేస్తానని" అని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు అందరికీ గుర్తున్నవి.కెసిఆర్ మాటలు,కల్లబొల్లి కబుర్లతో కాలయాపన తప్ప ఆ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ప్రజలు అభిప్రాయపడ్డారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఇతర ఖాయిలాపడిన పరిశ్రమలు తెరిపిస్తా అని మాటిచ్చి అమలుచేయలేదు. నిరుద్యోగ భృతి 3016 ఇస్తామని మాట ఇచ్చి ఇవ్వలేదు, ఉద్యోగాలను లక్షల సంఖ్యలో భర్తీ చేస్తానని యువతను మోసం చేయడమే కాకుండా పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వీర్యపరిచి పేపర్ లీకేజీలతో అస్తవ్యస్తమైన విధానాన్ని అమలు చేసింది.ప్రకృతి సహకరించడం వల్ల వర్షాలు కురవడంతో కొంత వెసులుబాటు జరిగిందే తప్ప 2024 లో వర్షపాతం తగ్గీ పంటలు ఎండిపోతుంటే ''మా ప్రభుత్వం లేక పోవడం వల్ల జరిగిన నష్టం.కాంగ్రెస్ తెచ్చిన కరవు'' అంటూ కేసీఆర్,ఆయన వంది మాగధులు చేసిన ప్రచారాన్ని జనం నమ్మలేదు.

కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ ప్రభుత్వానికి ఏటీఎంలా మారిందని బిజెపి అధ్యక్షుడు జేపీ నడ్డా,ప్రధానమంత్రి ,అనేక సార్లు నాటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపైన ఆరోపణలు చేసినప్పటికీ కేంద్రప్రభుత్వం ఏనాడు చర్యలు చేపట్టలేదు.కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్ గా దర్యాప్తు జరుపుతున్నందున అవినీతిపరులు కటకటాల్లోకి వెళ్ళవలసిన రోజులు సమీపించినట్టు తెలుస్తున్నది.

**రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి పదేళ్లలో చివరి దశలో మొక్కుబడిగా అమలు చేసిన విషయం మన అందరికీ తెలియదా? రెండవ దఫా ఎన్నికల సందర్భంగా అఖిలపక్షాలతో సమావేశాలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంటానని ఇచ్చిన హామీ ఏనాడు నెరవేర్చని ఆ ప్రభుత్వం ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎలా అవుతుంది? ప్రజాస్వామిక దృక్పథం లేని బిఆర్ఎస్ కు కాంగ్రెస్ 4 నెలల ప్రభుత్వాన్ని విమర్శించడానికి అధికారం ఎక్కడిది? మంత్రులకు ముఖ్యమంత్రినీ కలిసే అవకాశం లేదు, ప్రజలకు ప్రజాప్రతినిదుల కలిసే వెసులుబాటు లేదు, ఫామ్ హౌసుల సంస్కృతిని ప్రోత్సహించిన కారణంగా ప్రతి ఎమ్మెల్యే కూడా ఫామ్ హౌస్ లు నిర్మించుకొని భూ కబ్జాలు అక్రమ దందాలకు పాల్పడి అవినీతిలో కూరుకుపోయిన విషయాలు ఒకటొకటే బయటపడుతున్నాయి.దళిత బంధు విషయంలో శాసనసభ్యులు మూడు లక్షల రూపాయలు కమిషన్లు తీసుకున్నట్లు స్వయంగా ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విషయంతో నాటి ప్రభుత్వ నైతిక విలువలు ఏ పాటివో అర్థమవుతూనే ఉన్నది.**

సచివాలయానికి రాకుండానే పరిపాలన చేసి చివరి దశలో అప్పటికే ఎంతో పటిష్టంగా ఉన్న పాత సచివాలయాన్ని కూల్చి వందలాది కోట్ల రూపాయలను వృధా చేసిన విషయం పైన ప్రతిపక్షాల విమర్శకు నాటి ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు.అనేక భవనాలను నేలమట్టం చేసి తిరిగి నిర్మించే క్రమంలో ప్రాజెక్టులు, కాలువలు,వాటర్ ట్యాంకులు,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నాణ్యత లోపంతో ఉన్నట్లు తెలిసిన సంగతే.అంటే ఆ ప్రభుత్వం మొత్తం అవినీతిలో కూరుకుపోయినట్లేనన్న అపవాదు ఉన్నది.బిఆర్ఎస్ ప్రభుత్వంపైన ప్రజల ఆగ్రహం,అసమ్మతి నిరసనలు వెల్లువెత్తాయి.మేధావులు,బుద్ధి జీవులు,నిరుద్యోగులు ,ప్రజా సంఘాలు టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని ఇచ్చిన పిలుపు కారణంగా రాష్ట్రంలో 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.ప్రజాస్వామ్యంలో ప్రజలను కేవలం ఓటు బ్యాంకులుగా చూస్తున్న కారణంగా రాజకీయాలను కేసీఆర్ పార్టీ చౌకబారుగా మార్చేసింది.

**ఏ పార్టీ ప్రభుత్వం ఎంత కాలం పని చేసింది? ఇచ్చిన హామీలు ఏమిటి? అమలు చేసిన తీరు ఎలా ఉంది? ఎంత కాలంలో అమలు చేసింది? వంటి అంశాలే సమగ్రమైన చర్చ జరగాలి. పదేళ్ల పాలనలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మాట ఇచ్చినా అమలు కాలేదు.రాష్ట్రానికి బీజేపీ నుంచి ఎలాంటి సహకారం లభించలేదని బిఆర్ఎస్ తన పరిపాలన కాలంలో కేంద్రంపై ఘర్షణ కు దిగి పరిస్థితిని మరింత జటిలం చేసుకున్న ఖ్యాతి కేసీఆర్ కు దక్కుతుంది. విభజన హామీలలో భాగంగా రాష్ట్రానికి రావలసిన బయ్యారం ఉక్కు కర్మాగారం,కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి అనేక అంశాలు కేంద్రం పెండింగ్లో ఉంచడమే కాకుండా ఒక్క నవోదయ కేంద్రం కానీ మెడికల్ కళాశాల కానీ ఈ రాష్ట్రానికి మంజూరు చేయలేదని బిఆర్ఎస్ అప్పట్లో ఘాటుగా విమర్శలు గుప్పించింది.**

రాష్ట్రానికి ఏమాత్రం నిధులను తీసుకురాక,కేంద్రం సహకరించకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల వ్యవధిలోనే హామీలను అమలు చేయలేదని బిఆర్ఎస్ గగ్గోలు పెట్టింది. బీఆర్ ఎస్ ప్రభుత్వం అమలు చేయని హామీలను రేవంత్ రెడ్డి ఎలా అమలు చేయగలరు?నిధుల పరిస్థితి ఏమిటి? బిజెపి,బిఆర్ఎస్ లకు పోటీగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కొన్ని వాగ్దానాలు కొంత అధికంగా ఇచ్చిన మాట వాస్తవం.కొన్ని కార్యక్రమాల అమలుకు గాను కాల పరిమితిని విధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి మైనస్ పాయింటు.కానీ సుదీర్ఘమైన సమస్యలు పెండింగ్ లో ఉన్నప్పుడు 7 లక్షల కోట్ల రూపాయలను కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసి, దాదాపు 70 వేల కోట్ల కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా నిలిపివేయడం కాంగ్రెస్ కు అంది వచ్చిన ఆయుధం.పది ఏళ్లలో రాష్ట్రానికి బిఆర్ఎస్ చేసిన భూ దందాలు,ద్రోహం,ఆర్థిక అరాచకత్వం,అప్పులు,విధ్వంసంపై ఎండగట్టవలసి ఉన్నది.బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొదటి టర్మ్ లో ఆ ప్రభుత్వాన్ని ఎవరూ ప్రశ్నించలేదు. బిఆర్ఎస్ రెండో టర్మ్ లో భీభత్సం సృష్టించింది.ఇచ్చిన హామీలు తుంగలో తొక్కడం,ఇష్టారీతిన అధికారాన్ని చెలాయించడం,తమ సామాజిక వర్గానికి చెందిన వాళ్లను అధికారం యంత్రాంగంలో చేర్చుకోవడం వంటి అవలక్షణాలకు పాల్పడి ఆర్థిక అరాచకత్వం, అవినీతిలో కూరుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ లోపాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఇబ్బడి ముబ్బడిగా ప్రాపగాండా చేస్తున్నారు.పదేళ్ల పాలనా కాలంలో ఈ రాష్ట్రం గాడి తప్పింది.అవినీతిలో కూరుకుపోయింది.ఈ రాష్ట్ర ప్రజలకు అప్పును కేసీఆర్ కానుకగా ఇచ్చారు.కనుక బిఆర్ఎస్ నాయకుల మాటలను ఎవరు నమ్మే పరిస్థితిలో జనంలో లేరు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పేలాయి 17 నెలలు గడచినా పార్టీ అధినేత కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు.లోక్ సభ ఎన్నికల్లో పదహారు ఏడెనిమిది సీట్లు గెలుచుకోవాలని,తద్వారా కాంగ్రెస్ గెలుపు గాలివాటం అని నిరూపించాలని పెట్టుకున్న ఆశలు గల్లత్తు అయ్యాయి.
కేసీఆర్ మాటల మాంత్రికుడే.రాష్ట్ర విభజన అనంతరం రెండు పర్యాయాలు పార్టీ విజయానికి ఆయన ప్రసంగాలు ఒక కారణం. ఆయన ప్రసంగానికి ఒళ్ళు నిక్కబొడుచుకుని తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అనే సెంటిమెంట్ తో ప్రజలు ఓట్ల వర్షం కురిపించారు. కానీ కేసీఆర్ కుటుంబసభ్యుల అహంకార పూరిత వైఖరి,ప్రజలతో పూర్తిగా డిస కనెక్టు కావడం రేవంత్ రెడ్డికి కలిసి వచ్చిన అదృష్టం.'' రాష్ట్రం కోసం మా పార్టీ చాలా చేసింది.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైంది అని చెబితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రాజకీయ విశ్లేషకులు. అంటున్నారు.

ఆత్మగౌరవం అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది.అలాంటి రాష్ట్రంలో కేసీఆర్ తమ ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్నారని ప్రజలు భావించారు. కేసీఆర్ అహంకార ధోరణి ప్రజల్లో వ్యతిరేకతను పెంచింది.అసెంబ్లీ ఎన్నికల్లో అది స్పష్టంగా కనిపించింది.ఆ వ్యతిరేకత పార్లమెంటు ఎన్నికల్లోనూ కనిపించింది.తన కుటుంబంపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలను ప్రజలు నమ్ముతున్నారన్నా సంగతి కేసీఆర్ గ్రహించలేకపోతున్నారా? గ్రహించినా ఏ ప్రాంతీయ పార్టీ అయినా అంతే కదా అని ఊరుకుంటున్నారో తెలియదు. బీఆర్ఎస్ ఇప్పట్లో కోలుకునే అవకాశమే లేదని కొందరు విశ్లేషకుల వాదన.కేసీఆర్ పటిష్టమైన పార్టీ నిర్మాణం చేయడంలో విఫలం అయ్యారు.పార్టీని బలోపేతం చేసే నాయకుల్ని పైకి తీసుకురాలేదు.ఒక నియంతలా పార్టీని తన గుప్పెట్లో పెట్టుకున్నారు. అసంతృప్తిని చెప్పుకునే అవకాశం కల్పించలేదు. ప్రగతి భవన్ లో ఎంట్రీకి మంత్రులు, ఎమ్మెల్యేలకే అవకాశం లేకుండా పోయింది. ఇక సామాన్యులు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఎక్కడ ఉంటుంది? మంత్రులు,ఎమ్మెల్యేలతో ఆయన ఎలా అయితే నియంతలా వ్యవహరించారో నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు కూడా అలానే వ్యవహరించారు.

**తనను చూసి ప్రజలు ఓట్లు వేస్తారని కవిత ఎపిసోడ్ తర్వాత కూడా కేసీఆర్ ధీమాగా ఉన్నట్టు ఫార్మ్ హౌజ్ వర్గాలు చెబుతున్నవి. బీఆర్ఎస్ అమలు చేసిన ప్రతి పథకం ఓట్లు కురిపించే ఓటు బ్యాంకులానే చూశారు. దళితబంధు,డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వంటి పథకాల బాధ్యత ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలకు అప్పజెప్పారు. దీంతో ఎమ్మెల్యేలు తమ వాళ్ళకు ప్రాధాన్యం ఇవ్వడం, అవినీతికి పాల్పడటం లాంటివి జరిగాయి.ఇవన్నీ ప్రజలు గమనించారు.అందుకే బీఆర్ఎస్ పార్టీని ఓడించారు. భవిష్యత్తులో కాంగ్రెస్ ఇంకా పుంజుకుంటుందని పలువురు రాజకీయ పరిశీలకుల మాట. బీఆర్ఎస్ తమ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేసింది. విద్య, వైద్య, వ్యవసాయ, రెవెన్యూ వ్యవస్థల్ని విధ్వంసం చేసింది.ప్రజల స్వేచ్చను హరించారు.పోరాడి సాధించిన తెలంగాణలో ఆందోళనలు చేస్తే హౌజ్ అరెస్టులు చేయించారు.ఇదే పరిస్థితి తెలంగాణ ఉద్యమ సమయంలో ఉంటే,అప్పటి నాయకులు ఆందోళనలు చేయకుండా కట్టడి చేసి ఉంటే ఈరోజు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యేదా? అనే ప్రశ్నలకు కేసీఆర్ దగ్గర జవాబు లేదు.**

రాష్ట్రంలో దాదాపు 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు.వారందరికీ ఉద్యోగాలు ఇవ్వడం కష్టం. కానీ ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయలేదు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ప్రజల స్వేచ్చని హరించారు అనడానికి అతి పెద్ద ఉదాహరణ. తెలంగాణ అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో ఉందని బిఆర్ఎస్ ముఖ్య నేతలు పదే పదే చెబుతున్నారు.అలాంటప్పుడు హ్యూమన్ డెవలప్మెంట్ 21 వ స్థానంలో ఎందుకు ఉంది? ఆదాయం ఎటు మళ్ళుతుంది? మిగులు బడ్జెట్ లో ఉన్న రాష్ట్రం ఎందుకు అప్పులు పాలయ్యింది. కేసీఆర్ కుటుంబం,ఆ పార్టీ నాయకులు అవినీతి చేశారా? అనే ప్రశ్నలు కోకొల్లలు.కేసీఆర్ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు. ఇప్పుడు ఆయన ఏం చెప్పినా ప్రజలు నమ్మరు.గెలుపు కాంగ్రెస్ ఖాతాలో పడినప్పటికీ ఇది ప్రజల్లో ఆయనపై ఉన్న వ్యతిరేకత వలనే జరిగింది. కాంగ్రెస్ ఇప్పుడు పదేళ్లలో బీఆర్ఎస్ నేతలు చేసిన అవినీతి గురించి చెబుతూ అప్పుల రాష్ట్రాన్ని చేతిలో పెట్టినప్పటికీ ఉద్యోగుల జీతాలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వాన్ని నడిపడానికి రేవంత్ ప్రయత్నిస్తున్నారు.తాము ఇచ్చిన హామీలు ఐదేళ్లలో అమలు చేస్తామని ప్రజలకి నమ్మకం కలిగిస్తే కాంగ్రెస్ కచ్చితంగా 2028 లోనూ స్వీప్ చేయవచ్చు.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

''తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో దున్నేవారికి భూమి దక్కింది.బంజరు,పోరంబోకుల, ప్రభుత్వ భూములు పేదలపరమైనాయి. భూస్వాములు పట్టణాలకు పోయారు. జాగిర్దారీ విధానం రద్దయ్యింది. భూస్వాముల భూ కేంద్రీకరణ రద్దు అయింది. వెట్టి చాకిరి రద్దయ్యింది. కానీ భూములు -వనరులు సమ పంపిణీ లేకపోతే తెలంగాణాలో మళ్లీ మళ్లీ ఉద్యమాలు పుడతాయి.ఈ ప్రాంతమెప్పుడూ రణ భూమిగానే మిగులుతుంది''అని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సేనాని రావి నారాయణరెడ్డి యాభై ఏళ్ల క్రితమే తెలంగాణ ఆత్మను ఈ వాక్యాల్లో విప్పి చెప్పారు.తమ కుటుంబానికి ఉన్న మూడు వేల ఎకరాల భూమిలో తన వంతు వాటాగా వచ్చిన 500 ఎకరాలను పేదలకు పంచి, జనగామ తాలూకాలో ఏకంగా 10వేల ఎకరాలను గుప్పిట్లో పెట్టుకున్న విస్నూర్ రామచంద్రారెడ్డి వంటి దేశ్ముఖ్ లు, జాగిర్దార్ల పీచమణచి మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాజరికాన్ని పారదోలింది. తెలంగాణ సాయుధ పోరాటం. భూమితో పాటు దోపిడి, అరాచకం, ఏక వ్యక్తి పరిపాలనపై రైతు కూలీలు తిరగబడి నాలుగువేల మంది వీరుల రక్త తర్పణతో హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనను పతనం చేసింది.

తెలంగాణలో సాయుధ పోరాటం మొదలుకుని ఇరవై ఐదేళ్ల క్రితం ప్రారంభమైన మలి దశ తెలంగాణ పోరాటంలోనూ భూమి,అణచివేత, నియంతృత్వ పాలన వంటి అంశాలను తెలంగాణా సమాజం ప్రశ్నిస్తూ వస్తోంది.తెలంగాణ ఏర్పాటు జరిగిన తర్వాత కూడా వనరులు, సంపద పంపిణీతో పాటు రాజ్యాధికారం,కీలక నిర్ణయాధికారంలో అన్ని వర్గాల ప్రాతినిధ్యం లేకపోవడం ఒక విషాదం. నాడు నిజాం హయాంలోనూ ప్రజాస్వామికంగా కనిపించేందుకు ఒక 'లెజిస్లేటివ్ కౌన్సిల్' ఉండేది.అయినా,అందులో సభ్యులంతా జాగిర్దార్ల ప్రతినిధుల నుండే వచ్చేవారు.పేరుకు లెజిస్లేటివ్ కౌన్సిల్ ఉన్నా,నిర్ణయాధికారమంతా నిజాం నిర్ణయించిన మేరకు ప్రధానమంత్రి తూచ తప్పకుండా అమలు చేసేవారు.ఎలాంటి ప్రజాభిప్రాయం, మేధోమథనం లేకుండానే నిజాం నోటి నుండి ఆ క్షణానికి ఏం మాట వస్తే అదే ఫర్మానాగా హైదరాబాద్ కునారిల్లింది.హైదరాబాద్ సంస్థాన ప్రజలు ఆకలి,అవసరాల కంటే ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిచ్చేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా 1996,97 లలో భువనగిరి కేంద్రంగా మలి దశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అధికారంలో ఉన్నది ఎవరైనా, ఎప్పుడైనా,ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవటం, అందరికీ చెందాల్సిన భూమి,వనరులను గుప్పిట్లో పెట్టుకోవటం, సంపద పంపిణీ సక్రమంగా చేయకపోతే సహజసిద్ధంగానే తెలంగాణకు ఆగ్రహం వస్తుంది.కేసీఆర్ పాలనలో జరిగింది ఇదే.అందుకే ఆయనను ప్రజలు తిరస్కరించి ఫార్మ్ హౌజ్ కు పంపించారు.

ఆచార్య వినోభాబావే దేశంలో ఎక్కడా లేని విధంగా భూమి కోసం గుండెనెత్తురులు తర్పణ చేసిన తెలంగాణను భూదానం కోసం ఎంచుకుని వేల ఎకరాలను సేకరించారు,నిరుపేదలకు పంచారు. కానీ నేడు అవే భూములు మళ్లీ కార్పొరేట్ కంపెనీలు, నయా భూస్వాముల కౌగిళ్లలోకి వెళ్లిపోయాయి. దశలవారీగా పేదలకు చెందిన భూములన్నీ మళ్లీ పేదల చేతుల నుండి పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నేడు తెలంగాణలో భూమి లేని నిరుపేదల సంఖ్య భారీగా పెరిగిపోయింది.'భూదాన' భూములన్నీ కేసీఆర్,ఆయన కుటుంబసభ్యుల,బంధువుల,బినామీల గుప్పిట్లోకి వెళ్లినట్టు ఆరోపనలు వస్తున్నవి.ఈ మేరకు హైకోర్టుకు ఎన్ ఫోర్స్ డైరెక్టరేట్ ఒక నివేదిక ను సమర్పించింది.భూమి కోసం 1946 నుండి 1951 వరకు నాలుగువేల మంది రైతాంగ పోరాట యోధుల ఆత్మ బలిదానం చేశారు. 1969లో తెలంగాణ ఉద్యమం ,ప్రాంతీయ అసమానతలపై మలిదశ తెలంగాణ ఉద్యమంలో వందలమంది యువత ఆత్మ బలిదానాలు జరిగాయి.తెలంగాణ సిద్ధించినా మన వనరులు మనకు కాకుండా పోవడమో,ఒక సామాజికవర్గం వాటిని కబళించడమో,వలస వాదుల విజృంభణ కారణంగానే జరిగినట్టు అర్థం చేసుకోవచ్చు.

''ఆత్మగౌరవమే తెలంగాణ అస్తిత్వం'' అనే స్పృహతో ముఖ్యమంత్రి రేవంత్ పాలన సాగిస్తే ఆయనకు తిరుగుండదని విశ్లేషకులు అంటున్నారు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

## ఒకరి పరిస్థితి విషమం

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం బీర్సాయి పేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా... మరొక చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. కాళేశ్వరం వెళ్లి ఆదిలాబాద్ వైపు తిరిగి వస్తుండగా కారు అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని రిక్షా కాలనీ కి చెందిన ఈర్ల రాజు తన భార్య సృజనిత, కొడుకు హర్ష, కూతురు ఆద్య, అత్త విజయలతో కలిసి కాళేశ్వర దర్శనానికి వెళ్ళారు. అక్కడి నుండి తిరిగి వస్తుండగా ఉట్నూర్ మండలం బీర్సాయి పేట వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో హర్ష, విజయ అక్కడికక్కడే మృతి చెందారు. రాజు, సృజనిత, ఆద్య లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై మనోహర్ ఘటన స్థలం వద్ద వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అక్కడి నుండి క్షతగాత్రులను రిమ్స్ కు తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ వారి ఆరోగ్య పరిస్థితిని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పర్యవేక్షించారు. ఆద్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను అంబులెన్స్ లో హైదరాబాద్ కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న వారిని కలిచివేశాయి. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి తరలివచ్చారు. ఒకే కుటుంబం నుండి ఇద్దరు మృతి చెందడంతో బాధిత కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం మృత దేహాలను జిల్లా కేంద్రానికి తరలించారు.



# జిల్లా కలెక్టర్ ను కలిసిన బల్దియా కమిషనర్

**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ను, హన్మకొండ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ కే. పట్టాభి రామా రావును, వరంగల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, వి.బి. నిర్మల గీతాంబ లను వారి వారి కార్యాలయాల్లో సోమవారం జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పయ్ మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా వారు నూతన బల్దియా కమిషనర్ చాహత్ బాజ్పయ్ కు శుభాకాంక్షలు తెలిపారు.



# బల్దియా ప్రజావాణికి వెల్లువెత్తిన వినతులు

## జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయ్

**వరంగల్ మహా;** బల్దియా లో సోమవారం నిర్వహించే ప్రజావాణికి ప్రజల నుంచి భారీగా వినతులు వెల్లువెత్తాయి. గతంలో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సరైన సమయంలో పరిష్కరించక చాలా వరకు పెండింగ్లో ఉన్నాయని సమాచారం. మళ్లీ కొత్తగా వచ్చిన వినతులు సెంచరీ దాటాయి. ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ప్ర జావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయ్ తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్ పయ్ప్ జల నుండి దరఖాస్తు లను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. అనంతపురం కమిషనర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను మానవతా దృక్పథంతో క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వినతులు పెండింగ్ లో ఉండకుండా ఏ వారానికి ఆ వారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి లో స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా 1.ఇంజనీరింగ్....26, 2.హెల్త్ & సానిటేషన్.....09,3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)...09, 4.టౌన్ ప్లానింగ్...58, 5.మంచినీటి సరఫరా......05, 6.హార్టికల్చర్.....02, 7.ఎలక్ట్రికల్. ....02 మొత్తం.... 111గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కమిషనర్ జోనా, సి ఎం హెచ్ ఓ డా.రాజా రెడ్డి, సెక్రటరీ అలీ వేలు ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ ఓ లు రమేష్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రచిందర్, ఏం హెచ్ ఓ డా.రాజేష్ టి ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





సైబర్ క్రైం జరిగితే హెల్ప్ లైన్ కు

# సమాచారం అందించాలి

**ఆదిలాబాద్, మహా:** సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే నేషనల్ సైబర్ హెల్ప్ లైన్ 1930 కి లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు అందించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సైబర్ నేరగాళ్ల వద్ద మోసపోయి... జిల్లా పోలీసు యంత్రాంగం సహాయంతో తిరిగి డబ్బులు అందుకున్న బాధితులు సోమవారం ఎస్పీని శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సైబర్ క్రైమ్ ద్వారా మోసపోయిన బాధితులకు సత్వర న్యాయం అందచేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్ బాధితులు వెంటనే 1930కి సంప్రదించడం వల్ల మోసపోయిన డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ తెలిపారు. గత నెల రోజులలో జిల్లా పోలీసు యంత్రాంగం దాదాపు పది కేసుల లో కోర్టు ద్వారా అందరి బాధితులకు లక్ష రూపాయల వరకు నగదు తిరిగి అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్రావు, సైబర్ క్రైమ్ ఇంచార్జ్ ఏసుదాస్, సిబ్బంది కె సాయి శివ, అబ్దుల్ ఆహద్, వై సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# లగ్జరీ రాజపుష్ప ప్రాపర్టీస్ క్లబ్ ని ప్రారంభించిన బ్యాట్మెంటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

**రాజేంద్రనగర్ మహా ;** నార్సింగీ మున్సిపాలిటీ పరిధిలో అతిపెద్ద లగ్జరీ రాజపుష్ప ప్రాపర్టీస్ క్లబ్ ఒడిస్సీ ని బ్యాట్మెంటన్ కోచ్ పుల్లెల గోపీచంద్,రాజపుష్ప ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి సోమవారం ఆవిష్కరించారు. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లలో ఒకటైన రాజపుష్ప ప్రాపర్టీస్ నార్సింగిలో ప్రధాన నివాస సముదాయం రాజపుష్ప అతిపెద్ద లగ్జరీ క్లబ్హౌస్ క్లబ్ ఒడిస్సీని ఘనంగా ప్రారంభించినట్లు ప్రకటించింది. 1,00,000+ చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న క్లబ్ ఒడిస్సీ, నివాసితుల కోసం ఆరోగ్యం, ఫిట్నెస్, విశ్రాంతి, సాంస్కృతిక సమ్మేళనాన్ని అందిస్తూ సామాజిక జీవనశైలిని కేంద్రంగామారనుంది. పద్మభూషణ్ అవార్డు గ్రహీత జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, రాజపుష్ప ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అతిథిగా పాల్గొన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మరియు ఔటర్ రింగ్ రోడ్ (ఓ ఆర్ ఆర్ ) కి నిమిషాల దూరంలోనే రాజపుష్ప ప్రావిన్షియా 23.75 ఎకరాల విస్తీర్ణంలో 3,498 ప్రీమియం అపార్ట్మెంట్లతో మాస్టర్ప్లాన్డ్ కమ్యూనిటీలో 6.5 ఎకరాల సెంట్రల్ కోర్ట్యార్డ్, 80% ఖాళీ స్థలాలు, జాగింగ్, సైక్లింగ్ ట్రాక్లు, స్కైవాక్లు




అందమైన పచ్చని ల్యాండ్స్కేప్లు ఉన్నాయి. ఆరోగ్యాన్ని, చురుకైన జీవనశైలిని ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా డిజైన్ చేయబడ్డాయి. రాజపుష్ప ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ క్లబ్ ఒడిస్సీతో మేము సంప్రదాయ రియల్ ఎస్టేట్కు మించి ఒక శక్తివంతమైన జీవనశైలి వ్యవస్థను నిర్మించాం, ఇది కేవలం ఇళ్లను నిర్మించడమే కాకుండా, ఆరోగ్యం, అనుబంధాలు ఆనందాన్ని పెంపొందించే కమ్యూనిటీలను నిర్మించాము. పుల్లెల గోపీచంద్ విశాలమైన ఈ ప్రాజెక్ట్ను ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ అభివృద్ధి పట్ల ఇంత ముందుచూపు ఉండటం నాకు స్ఫూర్తినిచ్చింది. క్లబ్ ఒడిస్సీ వంటి సౌకర్యాలు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అందించడమే కాకుండా, చురుకైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని కూడా ప్రోత్సహించారు.



మంత్రిగా బాధ్యతలు చేపట్టిన

# వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు శుభాకాంక్షలు

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య శాఖ, క్రీడలు యువజన సేవల మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసి శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.

# కౌన్సిల్ హాల్ పనులను త్వరగా పూర్తి చేయండి

## నగర మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ మహా;** బల్దియాలోని కౌన్సిల్ హాల్ పనులను వేగవంతం గా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి కొనసాగుతున్న కౌన్సిల్ నిర్మిత పనుల పురోగతిని ఇరువురు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ లు రవికుమార్, మాధవి లత, డి ఈ రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, ఏ ఈ లు రాగి శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.



# మోడీ11 ఏండ్ల పాలన పై మండల సంకల్ప సభ కార్యక్రమం

## పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని దేశాయిపేట మండలంలో మోడీ 11 ఏండ్ల పరిపాలన పై మండల శాఖ ఏర్పాటుచేసిన సంకల్పంతో సహకారం.. (కారేశాల) మండల సంకల్ప సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోది 11 సంవత్సరాల సుపరిపాలనలో, భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది, దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే లక్ష్యంతోనే భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ పేదలు, రైతులు, మహిళలు, యువకులకు ప్రోత్సాహకరంగా అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళీ, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి పెద్ది నవీన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు భరత్ వీర్, కార్యాలయ కోకన్వీనర్ మొండ్రాతి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కందగట్ల మల్లికార్జున్, డివిజన్ అధ్యక్షులు తోట సురేష్ బిజెపి నాయకులు కొంతం సంగీత్, బల్లకారి రాజు, వంగ సంపత్ తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్టేషనరీ ఇక్కడే కొనాలని విద్యార్థులపై ఒత్తిడి

## విద్యాశాఖ అధికారులు సమస్యలను పట్టించుకోరా..?

### ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్

**షాద్ నగర్, మహా:** ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన స్టేషనరీ ని ఇక్కడే కొనాలని బలవంతంగా వారికి నోటి పుస్తకాలను తదితర స్టేషనరీని మార్కెట్ ధరల కన్నా మిన్నగా అంటగడుతున్నారని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో షాద్ నగర్ పట్టణంలోని నారాయణ మరియు మేధా స్కూల్స్ లో పాఠ్యపుస్తకాలు మరియు నోట్ బుక్స్ విద్యార్థి సంఘాలు తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగా రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ హాజరై మీడియాతో మాట్లాడుతూ.. నారాయణ మరియు మేధా స్కూల్ లో విద్యార్థులా దగ్గర మాట్లాడిన ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠ్యపుస్తకాలు మరియు నైట్ బుక్స్ ఇక్కడే కొనాలి అని ఒత్తిడి చేస్తున్నారు అని అన్నారు... మరియు స్కూల్స్ లోనే యూనిఫామ్ కూడా అమ్ముతున్నారనీ దీనివళ్ళ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. విద్యా అధికారీ వెంటనే స్పందించి విద్యార్థులకు తగిన న్యాయం చేయాలి అని డిమాండ్ చేస్తున్నామనీ పేర్కొన్నారు. అలాగే నారాయణ స్కూల్ ఒక కమర్షియల్ బిల్డింగ్ కామర్షియల్ బిల్డింగ్ లో పాఠశాల నడపడానికి పర్మిషన్ ఎలా ఇచ్చారో? విద్యా శాఖా అధికారులు చెప్పాలనీ డిమాండ్ చేశారు. ప్రైవేట్ స్కూల్స్




విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు, మంచి మౌలిక వసతులు, మరియు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పుకుంటాయి. కానీ, ఈ సౌకర్యాల పేరుతో వసూలు చేసే అధిక ఫీజులు తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ఫీజులలో ట్యూషన్ ఫీజు మాత్రమే కాకుండా, ప్రవేశ రుసుము, రవాణా రుసుము, కార్యకలాప రుసుము, మరియు నోట్ బుక్స్, యూనిఫామ్లు, పుస్తకాల కోసం అదనపు ఖర్చులు కూడా ఉంటాయి. ఈ ఖర్చులు మధ్యతరగతి మరియు తక్కువ ఆదాయ కుటుంబాలకు భరించలేని స్థాయిలో ఉంటాయి.నోట్ బుక్స్ ఖర్చు ఒక ఆందోళన ప్రైవేట్ స్కూల్స్ తరచూ విద్యార్థులకు నోట్ బుక్స్, పుస్తకాలు, మరియు ఇతర అవసరమైన సామగ్రిని తమ స్కూల్ నుండి మాత్రమే కొనుగోలు చేయమని బలవంతం చేస్తాయి.



# మధుయాష్కి గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల శ్రీనివాస్ గుప్త

**బాలాపూర్ మహా:** టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్,మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ని వారి నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసిన నూతన TPCC ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త. ఈ సందర్భం గా ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన ఉప్పల శ్రీనివాస్ గుప్త ని మధుయాష్కి గౌడ్ అభినందించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఉప్పల శ్రీనివాస్ గుప్త తెలిపారు. పార్టీ లో అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని తెలిపారు. పార్టీ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లా ఇంచార్జి మంత్రిగా సీతక్కనే కొనసాగించాలి

## కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్

**ఆదిలాబాద్, మహా:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గా ధనసరి అనసూయ (సీతక్క)నే కొనసాగించాలని కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై మొదటి నుండి రాజకీయంగా పట్టు కలిగిన నాయకురాలని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్ లు, మండల పరిషత్ లు, సర్పంచ్ లు, సింగిల్ విండో చైర్మన్ లు సునాయసంగా గెలువాలంటే రాజకీయంగా పట్టు కలిగిన ఆమె ఉంటేనే బాగుంటుందని వివరించారు. కార్యకర్తల మనోభావాలను పార్టీ పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

# బ్యాంకులో నకిలీ బంగారం పెట్టిన నిందితులు అరెస్ట్

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ఏపీ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో పనిచేస్తూ నకిలీ బంగారం పెట్టి గోల్డ్ లోన్ తీసుకున్నారు. ఈ నకిలీ వ్యవహారం పై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నకిలీ బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి లోన్ తీసినటువంటి నిందితులు అయినటువంటి బ్యాంక్ ఉద్యోగులు రాము శర్మ తండ్రి పేరు రాజారాం శర్మ అసిస్టెంట్ మేనేజర్ తో పాటు పాసి జీవిత కుమార్ తండ్రి పేరు చోటాలాల్ పాసి, బ్యాంకులో అప్రైజర్స్ అయినటువంటి గౌరోజు బ్రహ్మచారి తండ్రి పేరు చంద్రయ్య పోలోజు రాజమౌళి తండ్రి పేరు నాగభూషణం లను సోమవారం అరెస్టు చేసి కోర్టుకు లో హాజరు పరిచి జైలుకు తరలించడం జరిగిందని ఇంతే జార్గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం ఏ షుకూర్ తెలిపారు.




రెక్కీ నిర్వహించి

# చోరీ చేస్తరు

## ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన వనస్థలిపురం పోలీసులు

14తులాల బంగారం,

24తులాల వెండి వస్తువులు సీజ్

**ఎల్బీనగర్,మహా :** రాత్రి వేళలో తాళాలు వేసున్న ఇండ్లను టార్గెట్ చేసి ఆ ఇండ్లలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నేరస్తులను వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. వనస్థలిపురం సిఐ మహేష్ గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ చెందిన మాండ్ల శివ(32), నగరంలోని సైదాబాద్ కు చెందిన ఉడావత్ బాషా(33),సైదాబాద్ కు చెందిన గోగుల విజయ్(28) వనస్థలిపురంలో రాత్రి వేళలో రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నారు.ఇలా వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో వనస్థలిపురం పీఎస్ పరిధిలో 5చోరీలు చేశారు. కాగా ఇందులో ప్రధాన నిందితుడు మాండ్ల శివ 7సార్లు జైలుకు వెళ్లి వచ్చిన తన బుద్ధి మార్చుకోలేదు. వీరిని సోమవారం అరెస్ట్ చేసిన పోలీసులు వీరి నుండి 14తులాల బంగారు ఆభరణాలు,24తులాల వెండి వస్తువులు,చోరీకి ఉపయోగించిన 1బైక్ సీజ్ చేసి రిమాండ్ కు తరలించారు.

# వినతుల పరిష్కారానికీ చర్యలు తీసుకోవాలి



## జిల్లా కలెక్టర్ రాజర్శి షా

**ఆదిలాబాద్, మహా:** ప్రజలు అందించే వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి విభాగంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి తరలి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను వినతుల రూపంలో అందచేశారు. పెద్ద ఎత్తున అర్జీదారులు హాజరు కావడంతో కలెక్టరేట్ ప్రాంగణం కిట కిట లాడింది. ఆర్జీలను స్వీకరించి వారి సమస్యలను సావధానంగా ఆలకించిన కలెక్టర్.... వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు విస్తృత సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, rdo వినోద్ కుమార్, వివిధ శాఖల అధికరులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.... ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా చూడాలన్నారు. సీఎం ప్రజావాణి లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు వచ్చే వారం లోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి విభాగంలో 104 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందనీ తెలిపారు.



# హామీలు నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి

## డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

**ఆదిలాబాద్, మహా:** పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీ బీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రజా సేవ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాజీ మంత్రి జోగురామన్న చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా భోజారెడ్డి మాట్లాడుతూ....నిరుపేదలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పాటు మహిళలకు ఉచిత బస్సు, రెండు వందల యూనిట్ల కరెంటు ఫ్రీ, అయిదు వందల రూపాయలకే గ్యాస్ ఇస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన పద్దెనిమిది నెలల కాలంలోనే ప్రజలకు అన్ని విధాలా న్యాయం చేసేలా పాలన కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# సుధీర్ రెడ్డి ఎల్బీనగర్ ప్రజలను ఇంకెంతకాలం మోసం చేస్తావు

## కాంగ్రెస్ పార్టీ జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి

**ఎల్బీనగర్,మహా:** ఎల్బీనగర్ లో ఉన్న రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించలేని చేతగాని దద్దమ్మవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఒప్పుకోవాలని జీహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి విమర్శించారు.2007 నుండి నుండి ఎల్బీనగర్ లో రిజిస్ట్రేషన్ సమస్య ఉందని అప్పటి నుండి చేశావ్ అని ప్రశ్నించారు. ఆరు నెలల్లో రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరిస్తానని చెప్పి గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడిచావు అని విమర్శించారు. ఆరేండ్ల నుండి నువ్ ఎం చేసినన్ అని ఇప్పుడు మధుయాష్కీ,కాంగ్రెస్ పార్టీ అంటూ సిగ్గు లేకుండ ఆరోపణలు చేస్తున్నవని విమర్శించారు. రిజిస్ట్రేషన్ సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తానని చెప్పి ఇప్పుడు ప్రజలను మోసం చేసి ఎం మొహం పెట్టుకొని నియోజకవర్గంలో తిరుగుతున్నావు అని అన్నారు.మీ పార్టీ,నీ స్వార్థం కోసం తప్పుల తడక జిఓ 118తీసుకువచ్చి జనాలను మోసం చేశావ్ అన్నారు.10ఏళ్ళు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ 11ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న సుధీర్ రెడ్డి ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ఇప్పుడు కాంగ్రెస్ పై మాట్లాడుతున్నారని అన్నారు.118 జిఓ పనిరాని జిఓ అని గుర్తించి ఆ సమస్య పరిష్కారానికి మధుయాష్కీ గౌడ్ ప్రభుత్వ పెద్దలు సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.నీవు చేసే మోసాలను ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** ప్రజావాణి లో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డి ఆర్ డి ఓ కౌసల్య దేవి, హౌజింగ్ పిడి గణపతిలతో కలసి ప్రజావాణి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో వివిధ సమస్యలకు సంబంధించిన 127 దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. రెవెన్యూ శాఖ 51, పిడి హౌసింగ్ 12, జి డబ్ల్యూ యం సి వరంగల్ 13 దరఖాస్తులు రాగా మిగత వివిధ శాఖలకు సంబంధించినవి 51 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలను పరిష్కరించాలని, సమస్య పరిష్కరించలేని సమస్యలు ఏవైనా ఉన్నట్లయితే వాటిని దరఖాస్తుదారునికి అర్థం అయ్యేలా చెప్పాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఇప్పటివరకు నిర్వహించిన గ్రీవెన్స్ లో స్వీకరించిన మొత్తం 11,221 దరఖాస్తులలో 10,349 దరఖాస్తులు పరిష్కరించగా 872 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వారిని కూడా త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిసిఓ నీరజ, డిపిఓ కల్పన డిఎంహెచ్ఓ సాంబశివరావు, డీఈవో జ్ఞానేశ్వర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు

## మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ

### పాల్గొన్న నగర మేయర్, జిల్లా కలెక్టర్, కమిషనర్



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఓ సిటీ పార్టీ క్యాంపు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నగర మేయర్ గండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు లతో కలసి నియోజకవర్గంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. మొదటగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కొండా సురేఖ కు నగర మేయర్, జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్లు పాలించిన బిఆర్ ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి ఇల్లు మంజూరు చేయలేదని, గత ప్రభుత్వంలో నిర్మించిన రెండు పడకల గదుల ఇండ్లు కూడా ఏ ఒక్క పేదవారికి అందించ లేదని సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రజా పాలనలో పేదవారికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం తో పాటు ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు తప్పకుండా మంజూరు చేస్తామని తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మొదటి విడతలో 1617 మందికి ప్రొసీడింగ్స్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం కమిషన్లు వచ్చే పనులు మాత్రమే చేసిందని లక్షల కోట్లు పెట్టి ప్రాజెక్టులు కట్టారు, కానీ పేదల కోసం ఏం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని అన్నారు. గతంలో నేను చేసిన అభివృద్ధే కనిపిస్తోందని గత 5 ఏళ్ల లో భారాస నాయకుడు తూర్పు లో ఏటువంటి అభివృద్ధి చేయలేదని తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా చేస్తానని పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన పేదలకు 3500 ఇండ్లు వరంగల్ తూర్పుకు కేటాయించారని నిర్ణీత సమయంలో ఇండ్ల నిర్మాణం చేసుకోవాలని అలాగే 400 నుండి 600 sft లోపే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రొసీడింగ్స్ ఇచ్చిన వారం రోజుల్లో భూమి పూజ చేసుకోవాల్సి ఉంటుందని మంత్రి సురేఖ తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సంధ్యా రాణి కార్పొరేటర్లు వస్కుల బాబు, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, చింతాకుల అనిల్ కుమార్, భోగి సువర్ణ, పోశాల పద్మ, కావేటి కవిత, బైరబోయిన ఉమా, గుండు చందన, ఓని స్వర్ణ లత, పూర్కాన్ బాల్నే సురేష్ బస్వరాజు కుమార స్వామి, సురేష్ జోషి , ఇందిరమ్మ ఇళ్ల నోడల్ అధికారి రామ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఆర్డిఓ సత్య పాల్ రెడ్డి, రెవెన్యూ, హోసింగ్, మెప్మా, బల్దియా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ కు సంఘీభావం తెలిపిన వరంగల్ తూర్పు భారాసా నేతలు



**వరంగల్ మహా;** తెలంగాణ భవన్ లో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా పెట్టిన అక్రమ కేసు నేపథ్యంలో ఏసీబీ విచారణ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా, వరంగల్ తూర్పు నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి, మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ తో పాటు బిఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు డాక్టర్ హరి రామా దేవి కేటీఆర్ కు మద్ధతుగా నిలిచి సంఘీభావం తెలిపారు.

# విద్యతోనే భవిష్యత్తు విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

## రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట

- ఉపాధ్యాయుల చేతిలో విద్యార్థుల భవిష్యత్తు
- విద్యార్థులకు దుస్తులు పాఠ్యపుస్తకాలు పంపిణీ
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** విద్యార్థులు లక్ష్యంతో చదవాలని విద్యతోనే భవిష్యత్తు తలరాత మారుతుందని ఎమ్మెల్యే కాలే యాదయ్య ఉన్నారు. నవాబ్ పేట్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య సందర్శించారు. మొదటగా పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న తరగతి గదులను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, విద్యార్థులకు యూనిఫార్మ్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు లక్ష్యంతో చదవాలని విద్యతోనే భవిష్యత్తు తలరాత మారుతుందని ఆయన విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు రాష్ట్ర సర్కార్ అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకోవాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తూ నిధులు సమకూరుస్తూ, పాఠశాలల అభ్యున్నతికి ముందడుగులు వేయడం జరుగుతుందని, విద్యార్థులు ఇష్టపడి చదవాలని, ఒక ఉన్నత స్థానాన్ని ఎంచుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని ఆయన విద్యార్థులను కోరారు. ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఉంటుందని, వారికి నాణ్యమైన విద్యను బోధించేలా ఉపాధ్యాయులు ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు సూచించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, కుడా చైర్మన్



**హన్మకొండ మహా :** హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్నేహా శబరీష్ ఐఏఎస్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, జ్ఞాపికను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు ఇబ్రహీంపట్టణానికి ఎమ్మెల్యే రాక...

## మార్కెట్ యార్డులో వాణిజ్య దుకాణాలు ప్రారంభం

### అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు .. ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నేడు ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన 17 వాణిజ్య దుకాణా సముదాయాలను, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని మంచాల, ఇబ్రహీంపట్నం మండలాలోని గ్రామాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, నూతన పనులకు శంకుస్థాపనలు చేసి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రోసిడింగ్ పత్రాలను అందజేయనున్నారు. అనంతరం భూభారతి భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి రెవెన్యూ సదస్సులో రైతు భూ సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి పాల్గొననున్నారు. నియోజకవర్గ ప్రజా భవన్ లో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయమన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయా కార్యక్రమాలకు సకాలంలో హాజరు కావాలని అధికారులు తెలిపారు.

# దుకాణదారులు చెత్తను ట్రాక్టర్ లకే అందించాలి



## నగర మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ మహా;** దుకాణదారులు చెత్త ను మున్సిపాలిటీ చెత్త తీసుకువెళ్లే ట్రాక్టర్ లకే అందించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం నగర పరిధి లోని 28 వ డివిజన్ వరంగల్ బట్టల బజార్ ప్రాంతం లోగల వెంకటేశ్వర ఆలయం సమీపం లో మేయర్ క్షేత్ర స్థాయి లో పర్యటించి సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కమర్షియల్ దుకాణదారులు చెత్తను బల్దియా నిర్వహించే చెత్త ట్రాక్టర్ లకే అందించాలని చెత్త ను ఇవ్వని షాపు ల సమాచారం సేకరించాలని చెత్త ను బహిరంగంగా ఆరుబయట , డ్రైన్ లలో వేసే వారికి పెనాల్టీ లు విధించాలని మేయర్ అధికారులను ఆదేశించారు. మేయర్ వెంట ఏం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, తదితరులు, పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం

## ఎమ్మెల్యే నాయినిరాజేందర్ రెడ్డి



**హన్మకొండ మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 53వ డివిజన్ లోని లష్కర్ సింగారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరైయ్యారు. అర్హులైన లబ్దిదారుల ఇళ్లకు భూమి పూజ కార్యక్రమం చేసి, పనులను ప్రారంభించారు. నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి స్థితిగతులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె గృహాల్లో ఉంటున్న మాకు సొంత ఇల్లు సహకారం అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి,ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బాబాయ్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు అజీజ్ ,రహీమున్నీసా నాయకులు ఎర్ర మహేందర్,మట్టెడ అనిల్ కుమార్, శ్యామ్,రేణికుంట ప్రవీణ్,సత్తార్,కాసిం,ఎర్ర చందు ,రజిత్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా;** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు సత్వరపరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజలు అందించిన అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణ, భూ రికార్డులు సర్వే, విద్యుత్, మున్సిపల్, విద్య, పోలీస్, సాగునీటిపారుదల, ఆర్ అండ్ బి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, కుడా, ఉపాధి కల్పన, వ్యవసాయ శాఖ, మైన్స్, కోశాధికారి, తదితర శాఖలకు సంబంధించి 145ఊ అర్జీలను ప్రజలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె. నారాయణ, సిపిఓ సత్యనారాయణ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా, నవాబ్ పేట్ మండలం, చిట్టిగిద్ద గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య హాజరై ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ సమస్యలను దరఖాస్తు రూపంలో సమర్పించాలని, అధికారులు తప్పకుండా భూ సమస్యలకు పరిష్కారం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖ, మేయర్ లను కలిసిన బల్దియా కమిషనర్





**వరంగల్ మహా;** బల్దియా కమిషనర్ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్ పాయ్ సోమవారం ఆర్ అండ్ గెస్ట్ హౌస్ లో రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ను మర్యాదపూర్వకం గా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని మేయర్ ఛాంబర్ లో నగర మేయర్ గుండు సుధారాణి ని బల్దియా కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించగా మేయర్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు నగరాభివృద్ధి, బల్దియా కార్యకలాపాలపై కాసేపు చర్చించారు.



# మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కార్పొరేటర్లు

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ దగ్గర కొండా దంపతుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంజూరు పత్రాలు లబ్దిదారులకు అందచేసిన సందర్భంగా 12,13,18, 20, 21, 22, 26, 27,32 33వ డివిజన్ల కు సంబంధించిన కార్పొరేటర్లు, లబ్ధిదారులు, ముఖ్యంగా 33వ డివిజన్ కు చెందిన 80 మంది లబ్ధిదారులు తమ సొంతింటి కలను సాకారం చేసిన మంత్రి కొండా సురేఖ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోడం శివకృష్ణ, సయ్యద్ వసీం, దాసరి రాజేష్, బత్తుల వినోద్ కుమార్, కత్తెరశాల శ్రీధర్, కొండా అభిమానులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


# ప్రజావాణికి 68 ఫిర్యాదులు సమస్యలు పరిష్కరిస్తాం

## జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి

### వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.. జిల్లా వైద్యాధికారులకు ఆదేశాలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (68) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ - 30 , ఇతర శాఖలకు - 38, మొత్తం 68 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ... వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలకు వచ్చే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# యువతకు బెస్ట్ పెట్టుబడి మార్గాలు

“ పెట్టుబడి విషయానికి వస్తే యువతకు, వయసుపైబడిన వారికి మధ్య ఉన్న తేడా ఇన్వెస్ట్‌మెంట్లు ముందుగా ప్రారంభించడం. యువతకు దీర్ఘకాలంలో ఇది ఎంతో కలిసొస్తుంది. 40-45 ఏళ్లు దాటిన వారితో సమానంగా యువత ఏదైనా పథకంలో పెట్టుబడి పెట్టి ఒకే సమయంలో ఉపసంహరించుకుంటే కచ్చితంగా యువతకు ఎంతో లాభం చేకూరుతుంది. అయితే ఎలాంటి పథకాల్లో పెట్టుబడి ప్రారంభించాలో స్పష్టత ఉండడంలేదు. యువకులు క్రమశిక్షణతో, ఆర్థిక నిపుణుల సలహాతో మంచి పథకంలో పెట్టుబడి ప్రారంభిస్తే ఆకర్షణీయ రాబడిని అందుకోవచ్చు. మార్కెట్‌లోని కొన్ని పథకాల గురించి తెలుసుకుందాం.

**పొదుపు ఖాతాలు, డిపాజిట్ సర్టిఫికెట్లు (సీడీలు)**

పొదుపు ఖాతా అనేది డబ్బును నిర్వహించేందుకు సరళమైన, అత్యంత రిస్క్ లేని మార్గం. అయితే ఇందులో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నప్పటికీ ఈ ఖాతాలు సురక్షితమైనవి. మరోవైపు సీడీలు మీ డబ్బును నిర్ణీత కాలానికి (6 నెలలు లేదా ఒక సంవత్సరం) లాక్ చేస్తాయి. అందుకు కొంత అధిక మొత్తంలో రాబడిని అందిస్తాయి.

**స్టాక్ మార్కెట్**

స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టడం ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా ఉంటుంది. మంచి కంపెనీని ఎంచుకొని పెట్టుబడి కొనసాగిస్తే కాలక్రమేణా అధిక రాబడిని అందించగలవు. అయితే ఇవి అస్థిరంగా ఉంటాయని గుర్తుంచుకోవాలి. వీటిలో రిస్క్ అధికంగా ఉంటుందని మరిచిపోకూడదు.

**ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), మ్యూచువల్ ఫండ్స్**

ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్ స్టాక్స్‌లో నిర్ణీత షార్ట్‌టర్మ్‌లో ఒడిదొడుకులు ఉన్నప్పటికీ లాంగ్‌టర్మ్‌లో మంచి రాబడిని అందిస్తాయి. అయితే ఇందుకు పెట్టుబడులను కొనసాగించాల్సి ఉంటుంది. ఈటీఎఫ్‌లు (కొన్ని స్టాక్స్ కలిపి ఉన్న ఫండ్) మార్కెట్‌లో నేరుగా లైవ్‌లో ట్రేడవుతాయి. మ్యూచువల్ ఫండ్స్ కూడా సెక్టార్ వారీగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. వాటిని నిత్యం ఫండ్ మేనేజర్ నిర్వహిస్తుంటారు.

**బాండ్స్**

బాండ్లు అంటే కాలానుగుణ వడ్డీ చెల్లింపుల కోసం కంపెనీలు లేదా ప్రభుత్వాలకు ఇచ్చే రుణాలు. ఇవి స్టాక్స్ కంటే సురక్షితమైనవి. కానీ, తక్కువ రాబడిని అందిస్తాయి.

**రియల్ ఎస్టేట్ (ఆర్ఈఐటీ)**

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (ఆర్ఈఐటీలు) యువ పెట్టుబడిదారులను భౌతిక ఆస్తిని కొనుగోలు చేయకుండానే రియల్ ఎస్టేట్ పెట్టుబడుల నుంచి డివిడెండ్ సంపాదించడానికి వీలు కల్పిస్తాయి. వీటిని చాలా బ్రోకరేజీ ఖాతాల ద్వారా కొనుగోలు చేయవచ్చు. ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోను వైవిధ్యపరచడానికి ఇది మంచి మార్గాన్ని అందిస్తుంది.

**విద్య, నైపుణ్యాలు**

విద్య, సర్టిఫికేషన్లు లేదా అధిక ఆదాయాన్ని సమకూర్చే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం (కోడింగ్, డిజైన్ వంటివి) కోసం పెట్టుబడి పెట్టడం అన్నింటికంటే మంచి ఇన్వెస్ట్‌మెంట్. దీన్ని ఎంత త్వరగా ప్రారంభిస్తే కెరియర్‌లో అంత ప్రయోజనం పొందుతారు.

# తత్కాల్ కొత్త రూల్: ఐఆర్‌సీటీసీ అకౌంట్‌కు ఆధార్ లింక్ చేసుకోండిలా..

తత్కాల్ రైలు టికెట్ బుకింగ్ విధానంలో భారతీయ రైల్వే కొత్త నిబంధనలు తీసుకొస్తోంది. జూలై 1 నుంచి ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) యాప్, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో తత్కాల్ టికెట్లను బుక్ చేసుకోవాలంటే ఆధార్ ధ్రువీకరణ తప్పనిసరి చేసింది. ఆన్‌లైన్ తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రక్రియలో ఏఐ బోట్‌లు, ఏజెంట్ల బెడదను నివారించేందుకు తత్కాల్ టికెట్ బుకింగ్ వ్యవస్థలో భారీ మార్పులు చేస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. తత్కాల్ అనేది ఇండియన్ రైల్వే ఫాస్ట్ ట్రాక్ టికెట్ బుకింగ్ వ్యవస్థ. దీని ద్వారా అప్పటికప్పుడు ప్రయాణానికి ఒక రోజు ముందు తక్కువ సమయంలో రైలు టికెట్లను బుక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇండియన్ రైల్వే అమలు చేస్తున్న కొత్త రూల్ ప్రకారం.. ఆన్‌లైన్‌లో తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోవాలంటే.. ఐఆర్‌సీటీసీ అకౌంట్‌కు యూజర్ ఆధార్ లింక్ చేసుకోవడం తప్పనిసరి. ఇందుకోసం కావాల్సినవి యాక్టివ్ ఐఆర్‌సీటీసీ అకౌంట్, ఆధార్ నెంబర్ లేదా వర్చువల్ ఐడీ, ఓటీపీ వెరిఫికేషన్ కోసం మొబైల్ ఫోన్.

**ఆధార్ లింక్ చేసుకోండిలా..**

- ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్ ( www.irctc.co.in )లోకి లాగిన్ అవ్వాలి.
- 'మై అకౌంట్'పై క్లిక్ చేసి 'అథెంటికేట్ యూజర్' ఎంచుకోండి.
- మీ ఆధార్ నెంబర్ లేదా వర్చువల్ ఐడీ ఎంటర్ చేయండి.
- 'వెరిఫై డీటెయిల్స్ అండ్ రిసీవ్ ఓటీపీ'పై క్లిక్ చేయాలి.
- మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేయాలి.
- సమ్మతి బాక్సును టిక్ చేసి 'సబ్మిట్' నొక్కండి.
- మీ ఆధార్ విజయవంతంగా లింక్ అయిన తర్వాత ధ్రువీకరణ కన్పిస్తుంది.





# జియోకి ఏమైంది?

## గగ్గోలు పెడుతున్న యూజర్లు




ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ రిలయన్స్ జియో నెట్‌వర్క్ సేవల్లో అంతరాయాలు తలెత్తాయి. ఇంటర్నెట్ కనెక్టివిటీ, మొబైల్ సిగ్నల్, జియో ఫైబర్ సేవలకు సంబంధించిన సమస్యల గురించి వేలాది మంది నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో జియో నెట్‌వర్క్ ద్వారా కాల్స్, ఇంటర్నెట్ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురైనట్లు అనేక మంది సోషల్ మీడియా వేదికగా నివేదిస్తున్నారు. ఇప్పటివరకు 12,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయని అంతరాయాల ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ తెలిపింది. ఇందులో ఎక్కువ ఫిర్యాదులు మొబైల్ డేటా వైఫల్యాలకు సంబంధించినవే. 32 శాతం మంది యూజర్లు కాల్ సంబంధిత సమస్యలను నివేదించగా, 12 శాతం మంది వినియోగదారులు జియో ఫైబర్ సేవల్లో అంతరాయం కలిగినట్లు ఫిర్యాదు చేశారు.

మధ్యాహ్నం 1:45 గంటలకు ఈ సమస్య ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఆ సమయానికి దాదాపు 400 మంది వినియోగదారులు జియో సేవలను యాక్సెస్ చేసేటప్పుడు సమస్యలను నివేదించారు. తర్వాత మధ్యాహ్నం 2:15 గంటలకు కేరళ, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి గణనీయమైన సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. వినియోగదారుల ఫిర్యాదులు పెరుగుతున్నప్పటికీ, రిలయన్స్ జియో దీనిపై స్పందించలేదు.



# ఉద్యోగాల కోతకు ఏఐ సాకు!

కృత్రిమమేధకు ఆదరణ పెరుగుతున్న కొద్దీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో గుబులు అధికమవుతోంది. తమ ఉద్యోగాల స్థానంలో ఏఐ పాగా వేస్తుందని చాలామంది జంకుతున్నారు. ఇదే అదనుగా కొన్ని కంపెనీలు కాస్ట్ కటింగ్, పునర్‌వ్యవస్థీకరణ పేరుతో ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలపర్ల స్థానాన్ని ఏఐ భర్తీ చేస్తుందని చెబుతూ కొన్ని కంపెనీల వ్యవస్థాపకులు, సీఈఓలు తమ మోడళ్ల అమ్మకాలను పెంచుకోవడానికి ఎక్కువగా ప్రచారం చేస్తున్నట్లు ఏఐ కోడింగ్ ప్లాట్‌ఫామ్ విండ్సర్ఫ్ వ్యవస్థాపక బృందం సభ్యుడు అన్షుల్ రామచంద్రన్ తెలిపారు. 'ఏఐ ప్రభావం పెరుగుతోందని చెబుతున్నవారిలో చాలా మంది ఎలాగైనా కొందరు ఉద్యోగులను తొలగించాలని కోరుకుంటున్నారు. అందుకు ఏఐను సాకుగా వాడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల్లో కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ కోసం ప్రత్యేకంగా ఏఐ నమూనాలను రూపొందిస్తున్నారు. మరిన్ని మోడళ్లను విక్రయించడానికి ఇది వ్యాపార వ్యూహంగా పని చేస్తుంది. డెవలపర్ అడాప్షన్, ఎంటర్‌ప్రైజ్ పార్ట్‌నర్‌షిప్ పరంగా అమెరికా తర్వాత భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా అవతరిస్తోంది. భారత్‌లో 1.7 కోట్ల మంది డెవలపర్లు ఉన్నారు' అని చెప్పారు. 'వాస్తవంగా కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడానికి భారత్‌కు సరిపడా శక్తి ఉంది. భారత్‌లో జీపీయూ క్లస్టర్లను నిర్మించడంపై చురుగ్గా ముందుకెళ్తున్నాం. ఇప్పటికే భారత్‌లోని ప్రముఖ ఐటీ కంపెనీలతో వివిధ స్థాయిల్లో కలిసి పనిచేస్తున్నాం. ఇండియన్ ఐటీ కంపెనీలు తమ అంతర్జాతీయ సహచరుల కంటే వేగంగా కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నాయి. అయితే ఈ కంపెనీలు ఇప్పటికే టెక్నాలజీని వివిధ విభాగాల్లో వైవిధ్యపరిచాయి' అని రామచంద్రన్ తెలిపారు.




## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ఫోన్ పౌచులు అమ్మి.. నీట్ విజేతగా..

కష్టే ఫలి. శ్రమయేవ జయతే.. అని అన్నారు పెద్దలు. ఇక్కడో కుర్రాడి సక్సెస్‌ను చూస్తే ఆ మాట ఒప్పుకుని తీరాల్సిందే. కరోనా టైంలో తన లక్ష్యాన్ని నిర్దేశించుకున్న యువకుడు.. రేయింబవలు కష్టపడ్డాడు. తాను అనుకున్నది సాధించి.. ఇప్పుడు నీట్ విజేతగా నెట్టింట ప్రశంసలు అందుకుంటున్నాడు. జార్ఖండ్‌కు చెందిన రోహిత్ కుమార్ (Jharkhand Rohit Kumar).. ఈ ఏడాది నీట్ యూజీ పరీక్షలో 549 మార్కులతో ఆల్ ఇండియాలో 12,484 ర్యాంక్ సాధించాడు (కేటగిరీ వైజ్‌గా 1,312 ర్యాంక్). ఫిజిక్స్ వాలాగా పేరుకున్న అలఖ్ పాండే.. తాజాగా ఈ యువకుడిని పలకరించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రోహిత్ కుమార్ తండ్రి స్థానికంగా కూరగాయలు అమ్మేవాడు. 12 తరగతి పూర్తయ్యాక పూర్తిగా నీట్ మీద దృష్టి పెట్టేందుకు పైచదువులు మానేశాడు రోహిత్. ఆపై కరోనా టైంలో ఓ మెడికల్ షాపులో పని చేసే సమయంలో ఎలాగైనా వైద్య వృత్తిలో స్థిరపడాలనే కసి మొదలైంది. ఆపై సెల్ ఫోన్ పౌచులు అమ్ముకునే దుకాణం తెరిచి.. రెండు పడవలపై ప్రయాణం చేస్తూ వచ్చాడు. ఉదయం 7గం. నిద్రలేచే రోహిత్ కుమార్.. పగలంతా తన బండి మీద సెల్ ఫోన్ పౌచులు అమ్ముకున్నాడు. ఆపై రాత్రి వేళలో ఇంటికి చేరి పుస్తకాలతో కుస్తీ పడుతూ వచ్చాడు. అలా అలా.. అర్ధరాత్రి 3గం. చదివేవాడు. ఇదే అతని రోజూవారీ చర్యగా మారింది. నీట్‌లో ర్యాంకుతో రోహిత్ కుటుంబం ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తనకు వచ్చిన ర్యాంకుకు.. సొంత రాష్ట్రంలోనే సీటు రావాలని ఆశలు పెట్టుకున్నాడతను. చివరగా.. వెళ్తూ వెళ్తూ ఫిజిక్స్ వాలా అలఖ్ పాండే ఆ కుర్రాడికి డాక్టర్ కోటును బహుకరించాడు. కాబోయే డాక్టర్‌గా ఆ వైట్ కోట్‌ను ధరించి మురిసిపోయిన ఫొటో, వీడియోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ ఏడాది 22.09 లక్షల మంది నీట్ యూజీ పరీక్ష రాశారు. గతేడాదితో పోలిస్తే ఇది కొంచెం తక్కువే. ఫలితాల్లో.. ఈ ఏడాది రాజస్థాన్‌కు చెందిన మహేష్‌కుమార్ 99.09999547 శాతంతో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఢిల్లీకి చెందిన అవికా అగర్వాల్ ఫిమేల్ టాపర్‌గా నిలిచింది. ఉత్తర ప్రదేశ్ నుంచి అత్యధికంగా లక్షా 70 వేల మంది అర్హత సాధించగా.. మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి అభ్యర్థులు తర్వాతి స్థానాల్లో నిలిచారు.





# భయంతో చచ్చిపోతున్నాం..

## భారతీయుల తరలింపునకు కేంద్రం ఆపరేషన్!

**ఢిల్లీ:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం నడుస్తోంది. బాంబు దాడుల కారణంగా భయాందోళన వాతావరణం నెలకొంది. మరోవైపు.. ఇజ్రాయెల్‌లో ఉన్న వివిధ దేశాల ప్రజలు ఎప్పుడేం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పట్టుకుని కాలం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులకు తరలించేందుకు కేంద్రం ఆపరేషన్ చేపట్టనున్నట్టు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న వేళ ఇరాన్‌లో విదేశీయుల తరలింపునకు ఆ దేశ అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులను తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ చేపట్టనుంది. ఇరాన్‌లో సుమారు పదివేల మంది భారతీయులు ఉన్నట్టు తెలుస్తోంది. ఆపరేషన్ పేరుతో ఖరారు చేయాల్సి ఉన్నట్టు సమాచారం. అయితే, ప్రస్తుతం గగనతలం మూసివేసినందున.. భూసరిహద్దుల మీదుగా విదేశీయులకు తీసుకెళ్లొచ్చని ఇరాన్ విదేశీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ఇరాన్‌లో తమ పరిస్థితి దినదినగండంగా ఉందని భారతీయ విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాము నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీలైనంత త్వరగా తమను స్వదేశానికి తీసుకెళ్లాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వైద్య విద్యార్థి ఇంతిసాల్ మొహిదీన్ మాట్లాడుతూ..'శుక్రవారం తెల్లవారుజామున భారీ పేలుడు శబ్దాలతో నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేచా. నాతోపాటు చాలామంది బేస్‌మెంట్‌కు పరుగులు తీశాం. అప్పటినుంచి మాకు నిద్ర లేని రాత్రులే మిగిలాయి.

ప్రతి రాత్రి పేలుడు శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. మేం ఉంటున్న ప్రాంతానికి కేవలం 5 కిలోమీటర్ల దూరంలోనే పేలుడు సంభవించినట్లు తెలిసింది. టెహ్రాన్‌లోని షాహిద్ యూనివర్సిటీలో నేను ఎంబీబీఎస్ చదువుతున్నాను. నాతో పాటు దాదాపు 350 మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. దాడుల నేపథ్యంలో భారత ఎంబసీ మాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. కానీ, మేం చాలా భయపడుతున్నాం. స్వదేశానికి తిరిగి రావాలనుకుంటున్నాం. పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారకముందే మమ్మల్ని తరలించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని కోరాడు. మరోవైపు.. ఇరాన్‌లో తాజా పరిణామాలపై భారత విదేశాంగ శాఖ (MEA) స్పందించింది. ఈ సందర్భంగా..'ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితిని టెహ్రాన్‌లో భారత ఎంబసీ నిరంతరం గమనిస్తోంది. అక్కడి భారతీయ విద్యార్థుల భద్రత కోసం చర్యలు తీసుకుంటోంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే కొంతమంది విద్యార్థులను సురక్షిత ప్రదేశాలకు తరలించింది. మిగతా వారి పరిస్థితిని కూడా ఎంబసీ అధికారులు పరిశీలిస్తున్నారు. నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం' అని చెప్పుకొచ్చింది.

# బైక్‌పై యువజంట వికృత చేష్టలు.. రూ.53,500 జరిమానా


**న్యూఢిల్లీ:** ఇటీవలి కాలంలో కొందరు యువతీ యువకులు రోడ్లపై విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. తాజాగా ఇటువంటి ఘటన ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో చోటుచేసుకుంది. ఈ ఉదంతానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఈ జంటపై చర్యలు తీసుకోవాలని పోలీసులను పలువురు కోరారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విస్తృతంగా వైరల్ అయిన ఈ ఐదు సెకన్ల క్లిప్‌లో ఒక యువకుడు బైక్ నడుపుతుండగా, ఒక యువతి పెట్రోల్ ట్యాంక్‌పై అతనికి రివర్స్ పొజిషన్‌లో కూర్చుని, తన కాళ్లను అతనికి వెనుకవైపుగా ఉంచింది. నిత్యం రద్దీగా ఉండే ఎక్స్‌ప్రెస్‌వేపై వారిద్దరూ హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్నారు. అయితే, ఆ మహిళ చేతిలో హెల్మెట్ ఉంది. అక్కడి సీసీటీవీ కెమెరాలలో ఈ ఉదంతమంతా రికార్డయ్యింది. ఈ వీడియోను గమనించిన తాము, ఆ వాహనం నంబరు ఆధారంగా బైక్‌ను గుర్తించి మోటారు వాహనాల చట్టంలోని సంబంధిత విభాగాల కింద రూ.53,500 చలానా జారీ చేశామని నోయిడా (ట్రాఫిక్) డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లకన్ సింగ్ యాదవ్ మీడియాకు పారు. ఈ సంఘటన సెక్టార్ 39 పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందన్నారు.



ప్రమాదకరమైన డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం తదితర నేరాల కింద మోటార్ వాహనాల చట్టంలోని వివిధ విభాగాల కింద పోలీసులు ఆ వాహనానికి చలానా జారీ చేశారు.

# ఛాతికి గురిపెట్టి.. కటకటాల్లోకి రివాల్వర్ రాణి..

డబ్బు ఉందనే పొగరు.. అధికారం ఉందనే అహంకారంతో కిందిస్థాయి సిబ్బందితో కొందరు వ్యవహరించే తీరు తీవ్ర విమర్శలకు తావిస్తుంటుంది. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే ఘటన. కారు దిగమని మంచిమాటగా చెప్పినందుకు.. పెట్రోల్ బంకు సిబ్బందిపైనే ఓ కుటుంబం దౌర్జన్యానికి దిగింది. ఆ ఇంటి బిడ్డ అయితే ఏకంగా తుపాకీతో సిబ్బందినే చంపుతానంటూ బెదిరించింది. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తర ప్రదేశ్ హర్దోయ్‌లో (Hardoi Viral Video) జరిగిన ఘటన తాలుకా వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఇషాన్ ఖాన్ అనే వ్యక్తి తన భార్య, బిడ్డతో కలిసి కారులో బయటకు వచ్చాడు. బిల్‌గ్రామ్ ఏరియాలోని ఓ సీఎన్‌జీ పెట్రోల్ పంప్ దగ్గర వాళ్ల కారు ఆగింది. అయితే.. గ్యాస్ నింపుతున్న టైంలో కారు దిగాలంటూ ఇషాన్‌ను మర్యాదపూర్వకంగా అక్కడి సిబ్బంది కోరారు. దీంతో.. ఊగిపోతూ నన్నే కారు దిగమంటావా? అంటూ దుర్భాషలాడుతూ సిబ్బందితో గొడవకు దిగాడు ఇషాన్. ఈలోపు.. అతని భార్య, కూతురు కూడా బయటకు వచ్చి ఆ గొడవలో చేరారు. కూతురు సురుష్‌ఖాన్ (అరిబా) కారు వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్లి అందులో ఉన్న రివాల్వర్‌ను బయటకు తీసుకొచ్చింది. నేరుగా అక్కడి సిబ్బంది ఛాతీకి గురిపెట్టి "కాల్చేయమంటావా?" అంటూ బెదిరింపులకు దిగింది. ఈలోపు..



అక్కడున్న జనం వాళ్లను దూరం తీసుకెళ్లి సర్దిచెప్పి పంపించి వేశారు. అయితే అక్కడున్న సీసీ ఫుటేజీలో ఆ వీడియో అంతా రికార్డయ్యింది. ఘటనపై బాధితుడు రజనీష్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ భార్యభర్తలతో కూడా ఆ రివాల్వర్ రాణిని కూడా అరెస్ట్ చేశారు. రివాల్వర్‌తో పాటు 25 క్యాట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ప్రకటించారు. ఆ రివాల్వర్ ఇషాన్ లైసెన్స్‌డ్ ఆయుధంగా పోలీసులు నిర్ధారించుకున్నారు. అయితే దురుసుగా ర్తించడంతో పాటు చంపుతామని బెదిరించినందుకుగానూ ఆ కుటుంబంపై మొత్తానికి కేసు నమోదయ్యింది.



# గతంలో కంటే ఇప్పుడే బాగున్నా!

కీర్తిప్రతిష్టలకు అతీతంగా.. స్వేచ్ఛగా జీవితాన్ని గడపటమే నిజమైన విజయమని చెప్పింది అగ్ర కథానాయిక సమంత. గత రెండేళ్లుగా తాను నటించిన సినిమాలు రాలేదని, ఈ సంధికాలంలో తానెంతో పరిణితి సాధించానని పేర్కొంది. తాజా ఇంటర్వ్యూలో ఈ భామ పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. జీవితం తాలూకు ఒకే వృత్తానికి పరిమితం కాకుండా స్వేచ్ఛగా వృద్ధిలోకి రావడం, పరిణితి సాధించడం అన్నింటికంటే ముఖ్యమని చెప్పకొచ్చింది. 'ఖుషి' తర్వాత సమంత ప్రధాన పాత్రలో నటించిన చిత్రమేది విడుదల కాలేదు. ఆమె నిర్మించిన 'శుభం' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో సమంత అతిథి పాత్రలో కనిపించింది. ఈ నేపథ్యంలో రెండేళ్ల విరామం తీసుకోవడానికి గల కారణాలను సమంత వివరించింది. ఇప్పడు నాకు విజయాలు లేవని చాలా మంది భావిస్తున్నారు కావొచ్చు. కానీ గతంలో కంటే ఇప్పడే నేను బాగున్నా. ప్రతీ రోజు ఉత్సాహంగా నిద్రలేస్తున్నా. జీవితాశయం దిశగా స్పష్టంగా ఆలోచిస్తున్నా. ఓ రకంగా చెప్పాలంటే ఇప్పడే నేను ఉన్నతమైన విజయాలను ఆస్వాదిస్తున్నా' అని సమంత చెప్పింది. ప్రస్తుతం స్వీయనిర్మాణంలో సమంత 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో 'రక్త్ బ్రహ్మాండ్' సిరీస్‌తో ముందుకురానుంది.

# జరిగితే ఈ ఏడాదిలో పెళ్లి.. లేదంటే మాత్రం!

సినిమా సెలబ్రిటీలు ప్రేమ, పెళ్లి అనేది ఇంట్రెస్టింగ్ టాపిక్. దీని గురించి ఏ చిన్న రూమర్ వినిపించినా సరే అభిమానులు ఎగ్జైట్ అవుతుంటారు. కొన్నిసార్లు కొందరు జ్యోతిషులు.. పలువురు నటీనటుల భవిష్యత్ గురించి అంచనా వేసి చెబుతుంటారు. కొన్నిసార్లు ఇది నిజమైతే, కొన్నిసార్లు ఇది జరగదు. గతంలో వేణుస్వామి ఎంత రచ్చ చేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు బాలీవుడ్‌లోనూ సుశీల్ కుమార్ అనే జ్యోతిషుడు.. హీరోయిన్ జాన్వీ కపూర్ పెళ్లి గురించి కామెంట్స్ చేశాడు. సిద్ధార్థ్ కన్నన్ యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన సదరు జ్యోతిషుడు.. జాన్వీ కపూర్ కెరీర్ 2026లో మంచి స్థాయికి వెళ్తుందని చెప్పారు. అలానే ఈ ఏడాదిలోనే జాన్వీ పెళ్లి చేసుకుంటుందని, ఒకవేళ లేదంటే మాత్రం 33 ఏళ్లకు ఆమెకు వివాహం జరుగుతుందని అంచనా వేశాడు. ఓవైపు ఆమె వైవాహిక జీవితం సాఫీగా ఉంటుందని చెబుతూన.. గ్రహగతుల వల్ల కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశముందని అభిప్రాయపడ్డాడు. ఏదేమైనా ఇప్పుడు జ్యోతిషుడు సుశీల్ కుమార్ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. జాన్వీ కపూర్‌కి బాయ్ ఫ్రెండ్ ఉన్నమాట నిజమే. గతంలో ఇతడితోనే పలుమార్లు తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంది. గతంలో ఓసారి మాట్లాడుతూ.. తాను పెళ్లి చేసుకుని తిరుపతిలోనే సెటిల్ కావాలనుకుంటున్నానని జాన్వీ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె చేతిలో రామ్ చరణ్ 'పెద్ది', బన్నీఅట్లీ ప్రాజెక్ట్ తదితర క్రేజీ మూవీస్ ఉన్నాయి. ఇలాంటి టైంలో పెళ్లి చేసుకుంటుందా అంటే కచ్చితంగా లేదని చెప్పొచ్చు. మరి సదరు జ్యోతిషుడు ఏ అంచనాతో చెప్పాడో ఏమో?

# చలో గుజరాత్

హీరో నాగచైతన్య గుజరాత్ వెళ్లనున్నారట. నాగచైతన్య హీరోగా కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ఓ మిస్టిక్ థ్రిల్లర్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమాకు చెందిన భారీ షెడ్యూల్ చిత్రీకరణ జరిగింది. ఓ ప్రముఖ స్టూడియోలో గుహ సెట్ వేసి, నాగచైతన్య పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ ఈ నెల చివరి వారంలో గుజరాత్‌లో ప్రారంభం కానుందని, నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా మేకర్స్ కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారని సమాచారం. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్, బి. సుకుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ కానుంది.





# ది రాజాసాబ్.. భయపెట్టడమే కాదు...

ప్రభాస్ పాన్ ఇండియా మూవీ 'ది రాజాసాబ్' టీజర్ వచ్చేసింది. రొమాంటిక్ హారర్ కాన్సెప్ట్‌తో దర్శకుడు మారుతి తెరకెక్కించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, మాళవిక మోహన్ కథానాయికలుగా నటిస్తున్నారు. సలార్, కల్కి 2898 ఏడీ వంటి వరుస హిట్ సినిమాల తర్వాత ప్రభాస్ నటిస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా విడుదలైన టీజర్‌ను చూస్తే వారి అంచనాలకు మించే ఈ చిత్రం ఉండొచ్చని చెప్పవచ్చు. సంగీతం తమన్ అందించారు. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ఇది విడుదల కానుంది.



# ప్రభుత్వ అవార్డులను స్వీకరించడం మన బాధ్యత: దిల్ రాజు




''ప్రభుత్వ అవార్డులను స్వీకరించాలి. షూటింగుల్లో బిజీగా ఉన్నా, ఎక్కడ ఉన్నా, ప్రభుత్వం నుంచి అవార్డు వస్తుందంటే స్వీకరించడం మన బాధ్యత. ప్రభుత్వంతో జర్నీ చేయాల్సిన బాధ్యత సినిమా ఇండస్ట్రీలోని ప్రతి ఒక్క రిదీ. భవిష్యత్తులో కూడా ప్రభుత్వం నుంచి అవార్డులు ప్రకటించినప్పుడు ఆ తేదీలను డైరీలో నోట్ చేసుకుని, ఒకవేళ మీకు అవార్డు ఉంటే ఆ అవార్డును స్వీకరించాలి. ఇది నా రిక్వెస్ట్. అది ఏ రాష్ట్రమైనా కానివ్వండి. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో కూడా అవార్డులు స్టార్ట్ అవుతాయి. ఎందుకంటే తెలుగు రాష్ట్రాలు మనకు రెండు కళ్లు'' అని అన్నారు. తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత 'దిల్' రాజు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం హైదరాబాద్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ ఛైర్మన్ 'దిల్' రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీష్ ఐఏఎస్ ఆదివారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్‌మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక సక్సెస్ కావడం సంతోషంగా ఉంది. అవార్డులు స్వీకరించిన అందరికీ ఎఫ్‌డీసీ తరఫున ధన్యవాదాలు చెబుతున్నాం. తెలంగాణ సీయం రేవంత్‌రెడ్డిగారికి స్పెషల్ థ్యాంక్స్. సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, డిప్యూటీ సీయం మల్లు భట్టి విక్రమార్కగారికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఇంత పెద్ద ఈవెంట్‌లో చిన్న చిన్న తప్పులు ఉండొచ్చేమో. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఏమైనా తప్పులు జరిగి, ఈవెంట్‌కు వచ్చినవారు ఒకవేళ హర్ట్ అయితే ఎఫ్‌డీసీ తరపున చైర్మన్‌గా క్షమాపణలు కోరుతున్నాను'' అని అన్నారు. ''సీయం రేవంత్ రెడ్డిగారి ఆదేశాలతో, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిగారి గైడెన్స్‌తో, ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజుగారి విజన్‌తో తెలంగాణ గద్దర్ అవార్డ్స్ వేడుకను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించుకున్నాం. ఈ సక్సెస్‌కు కారణమైన ప్రతి ఒక్కరీ కృతజ్ఞతలు'' అన్నారు ఎఫ్‌డీసీ ఎండీ హరీష్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com